సంపుటి : 9
సంచిక : 342
గురువారం
03 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE





Contact For Ads:
7579339999






## ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయం



- పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి చేరిన గోదావరి జలాలు
- రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామన్న హామీని నెరవేర్చామని చెప్పిన సీఎం చంద్రబాబు
- భవిష్యత్తులో సింహాచలం, అరసవల్లికి నీటిని తరలిస్తామని ప్రకటన
- గత ప్రభుత్వం విధ్వంసం చేస్తే, తాము అభివృద్ధి చేస్తున్నామని విమర్శ

**పాయకరావుపేట, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి, కృష్ణా సహా రాష్ట్రంలోని అన్ని నదులనూ అనుసంధానం చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటామని చెప్పారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పీఎల్ పురం వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. సాగునీటి ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలుగా నమ్ముతున్నట్లు చెప్పారు. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయమన్నారు.

**వచ్చే ఏడాదికి సింహాద్రి అప్పన్న చెంతకు గోదావరి జలాలు..**

"అనకాపల్లి బెల్లమంత తియ్యగా ఈరోజు ఎప్పటికీ గుర్తుంటుంది. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. నిండు మనసుతో దీవెన ఫలితంగానే అనకాపల్లికి గోదారమ్మ వచ్చింది. వెలిగొండతో కృష్ణమ్మను తరలించి మార్కాపురం జిల్లాకు నీళ్లిచ్చాం. తూర్పు కనుమలు, అడవులు, నదులు, హైవేలను దాటుకుని ఉత్తరాంధ్రకు గోదావరి వచ్చింది. వచ్చే ఏడాది నాటికి సింహాద్రి అప్పన్న, అరసవెల్లి సూర్యనారాయణ స్వామిచెంతకూ గోదావరి

మిగతా .. 2లో..

జనసేన యువజన విభాగం

## 'జై కొట్టు'




**పిఠాపురం, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పిఠాపురంలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ యువజన విభాగం 'జై కొట్టు' లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యకర్తలకు ఆడియో సందేశం ఇచ్చారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ "చెయ్యెత్తి జై కొట్టు' నినాదం మనందరినీ ఎంతో కదిలిస్తుంది. ఆ స్ఫూర్తిని మీకు అందించాలనే అధినేత పవన్ ఈ లోగో పెట్టారు. జై కొట్టు నినాదంతో ముందుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రాజకీయాల్లో యువతకు ప్రత్యేక స్థానం కల్పించాలనే ఈ విభాగాన్ని ఏర్పాటు చేశాం. అరుపులు.. కేకలు కాదు.. క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. అధినేత ఆదేశాలను జనసైనికులు క్రమశిక్షణతో పాటించాలి" అని సూచించారు.

**పవర్‌స్టార్‌గా అభిమానుల గుండెల్లో చెరగని స్థానం సంపాదించారన్న చంద్రబాబు**


**పవన్‌ను 'దేవుడిచ్చిన అన్నయ్య'గా అభివర్ణించిన మంత్రి నారా లోకేష్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

మిగతా .. 2లో..

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

- టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం ఇంట ఏసీబీ సోదాలు
- తిరుపతి, తిరుమలలోని ఇల్లు, ఆఫీసులో ఏకకాలంలో దాడులు
- బంధువుల ఇళ్లు, గెస్ట్ హౌస్‌పైనా ఏసీబీ అధికారుల తనిఖీలు
- ఏడు ప్రత్యేక బృందాలతో కొనసాగుతున్న సోదాలు



**తిరుపతి, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** టీటీడీలో అవినీతి ఆరోపణలు కలకలం రేపాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈవో) ఎం.లోకనాథం నివాసం, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఈరోజు దాడులు నిర్వహించారు. తిరుపతి, తిరుమలతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ ఏకకాలంలో సోదాలు జరుగుతున్నాయి. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో ఏడు బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి. ఈరోజు ఉదయం 6 గంటలకే అధికారులు తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లో ఉన్న లోకనాథం నివాసానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆయన ఇంట్లోనే ఉండగా తనిఖీలు ప్రారంభించారు. అదే సమయంలో తిరుమలలోని ఆయన కార్యాలయంలో మరో బృందం సోదాలు చేపట్టింది. ఈ దాడులు ఆదాయానికి

మిగతా .. 2లో..

## వైఎస్సార్ 17వ వర్ధంతి.. ఇడుపులపాయలో జగన్ నివాళి

**తండ్రి సమాధి వద్ద అంజలి ఘటించిన వైఎస్ జగన్ - వైఎస్సార్‌ను స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు**

**కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ విజయమ్మ, భారతి, కుటుంబ సభ్యులు**



**ఇడుపులపాయ, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అంజలి ఘటించారు. తన తల్లి వైఎస్ విజయమ్మ, భార్య భారతి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సమాధిని పుష్పగుచ్ఛాలతో అలంకరించి, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహానేతను

మిగతా .. 2లో..

## పల్నాడు జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

**నర్సరావుపేట జేఎన్ టీయూకే కాలేజీలో నూతన హాస్టల్ భవనాలు ప్రారంభం**

**రూ.70 కోట్ల వ్యయంతో విద్యార్థినీ, విద్యార్థులకు వసతి గృహాలు నిర్మాణం**



**నర్సరావుపేట, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో బుధవారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటించారు. నర్సరావుపేట మండలం కాకాని గ్రామంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, కాకినాడ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినీ, విద్యార్థులకు గౌతమి, కృష్ణవేణి, నాగార్జున పేర్లతో నూతనంగా నిర్మించిన మూడు హాస్టల్ భవనాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా కళాశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్ కు కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం రూ.70 కోట్ల వ్యయంతో

మిగతా .. 2లో..

నేతన్నలకు పెట్టుబడిగా

## నూలు సరఫరా

**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**అమరావతి, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** చేనేతలకు ఆర్థిక మేలు కలిగించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఇందులో భాగంగా పెట్టుబడిగా నూలు అందజేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. దీనివల్ల నేతన్నలపై పెట్టుబడి భారం పడకుండా ఉంటుందన్నారు. నేతన్నల సేవలో పథకం కింద కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి,

మిగతా .. 2లో..

## 'అది విధ్వంసక చర్యే'..

**పాక్‌లో ఆలయం కూల్చివేతను ఖండించిన భారత్**



**సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఇటీవల దాదాపు వందేళ్ల పురాతన ఆలయం కూల్చివేతను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనను విధ్వంసకర చర్యగా పేర్కొంది. ఈ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత, శతాబ్దం క్రితం నాటి ఆలయాన్ని పరిరక్షించడంలో వారి వైఫల్యం ఆందోళనకరమని తెలిపింది. "పాకిస్థాన్‌లో వందేళ్ల క్రితం నాటి

మిగతా .. 2లో..

## మొక్కలే మానవుడి జీవిత నేస్తాలు

**రాబోయే 20 ఏళ్లలో ఏపీ పచ్చగా కళకళలాడుతుంది**


**పిల్లలకు మొక్కలు నాటడం, పెంపకం అలవాటు చేయాలి**

**ఏపీ గ్రీన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ కొణిదల నాగబాబు**



**చిలకలూరిపేట, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** 'పెద్ద బాలశిక్షలో చెప్పినట్లు... పది బావులు ఒక చెరువులతో సమానం. పది చెరువులు ఒక మంచి నీటి సరస్సుతో సమానం. పది సరస్సులు ఒక బిడ్డతో సమానం. అలాంటి పది మంది ఉత్తమ బిడ్డలతో సమానం ఓ చెట్టు. పర్యావరణంలో వచ్చే మార్పులను, మన జీవన విధానాన్ని, జీవన ప్రమాణాలను పెంచే గొప్ప శక్తి చెట్లకు

మిగతా .. 2లో..




అయోధ్య రామాలయ

## తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర



**అయోధ్య, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ తొలి సీఈవోగా విశ్రాంత ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్ర ఎంపికయ్యారు. ఆయన దాదాపు 39 ఏళ్లపాటు వాయుసేనలో సేవలందించారు. సీఈవో పోస్టు కోసం ముగ్గురు సభ్యుల ఎంపిక కమిటీ 5,585 దరఖాస్తులను పరిశీలించింది. 16 మందిని ఇంటర్వ్యూ చేసింది. ముగ్గురి పేర్లతో కూడిన తుది జాబితాను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టుకు అందజేయగా.. బుధవారం సమావేశమైన ట్రస్టు సభ్యులు జితేంద్ర మిశ్ర పేరును ఖరారు చేశారు. మరోవైపు.. ట్రస్టు నూతన ప్రధాన కార్యదర్శిగా గోవింద్ దేవ్ గిరి

మిగతా .. 2లో..

విమానాశ్రయాల

## పనుల్లో వేగం పెంచండి

**కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి**

**మామునూరు ఎయిర్‌పోర్టుకు డిసెంబరులో శంకుస్థాపన : కేంద్ర మంత్రి**



**దిల్లీ, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూ సేకరణను పూర్తి చేసి అప్పగించినట్లు తెలిపారు. ఆయన బుధవారం దిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయంలో రామ్మోహన్‌నాయుడుతో సమావేశమయ్యారు. ఆదిలాబాద్

మిగతా .. 2లో..

## వరదల వేళ ఆపన్నహస్తం..

**భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన నేపాల్ ప్రధాని**



**సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి విపత్తుతో అతలాకుతలమైన నేపాల్‌కు భారత్ అందించిన అపన్నహస్తంపై ఆ దేశ ప్రధాని బాలెన్ షా కృతజ్ఞతలు తెలిపారు. వరదలు సంభవించిన తొలి రోజే భారత్ స్పందించి సహాయ సామగ్రిని పంపిందని పార్లమెంటులో కొనియాడారు. మందులు, ఆహార పదార్థాలు, నీటిని శుద్ధి చేసే పరికరాలతో పాటు నిపుణులైన సహాయక బృందాన్ని పంపిందని వెల్లడించారు. నష్టం తీవ్రతను అంచనా వేసేందుకు పరిశీలనలు కూడా నిర్వహించారని చెప్పారు. భారత సాంకేతిక బృందాలు మారుమూల ప్రాంతాలకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయని వివరించారు. సంక్షోభ సమయంలో భారత్ నిజమైన మిత్రదేశంగా.. అండగా నిలిచిందని ప్రశంసించారు. వరద ప్రభావిత

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర కావడం ఖాయం

జలాలు తీసుకెళ్తాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీళ్లిచ్చి జలహారతితో తెలుగుతల్లి రుణం తీర్చుకుంటాం. గలగలా గోదావరి, బిరబిరా కృష్ణమ్మ పరుగులతో రాష్ట్రాన్ని సుభిక్షం చేస్తాం. ఈ జల విజయం.. ప్రజల విజయం. జలం ఉంటే జీవం.. జీవితం. గంగమ్మ ఉంటేనే పరిశ్రమలు, ఉపాధి, భద్రత, భవిష్యత్తు.

**గొడ్డలి పార్టీతో పోలవరానికి శాపం**

2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడం పోలవరానికి శాపమైంది. 2024లో ప్రజలు కూటమిని గెలిపించి పోలవరానికి శాపవిముక్తి చేశారు. గొడ్డలి పార్టీ విపక్షంలోనూ విషం కక్కుతోంది. విశాఖ రాజధాని అని మాయమాటలు చెప్పారు.. మావిగన్ అని మాట మార్చారు. సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించా. గోదావరి, కృష్ణా నదులతో ప్రజలకు మంచి జరగాలనేది నా జీవితాశయం. కాలువలో ప్రవహిస్తున్న ప్రతి నీటి చుక్క వెనుక ఇంజినీర్ల ప్రతిభ, కార్మికుల కష్టం, రైతుల నిరీక్షణ, నిర్వాసితుల త్యాగం, ప్రభుత్వం సమర్థత ఉన్నాయి. ఎడమ కాలువను విస్తరించి ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి అనుసంధానిస్తాం. 2028 నాటికి 12 ప్రాజెక్టులు పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. అందరూ అసూయపడేలా అనకాపల్లి జిల్లా అభివృద్ధి చెంది మరో రంగారెడ్డి అవుతుంది. రాబోయే రోజుల్లో ఉత్తరాంధ్రకే వలస వచ్చే విధంగా మారుతుంది. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్ర, ఉన్నతాంధ్ర కావడం ఖాయం. విశాఖకు ఐదు డేటా సెంటర్లు వస్తే ఐదు టీఎంసీల నీళ్లు కావాలి. 500 టీఎంసీలు తెచ్చే శక్తి మనకు ఉంది"అని చంద్రబాబు అన్నారు.

**అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది.. ఇది ఖాయం.. రాసిపెట్టుకోండి**

ఉత్తరాంధ్ర దశాబ్దాల కలను సాకారం చేస్తూ, పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి గడ్డపై అడుగుపెట్టాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం సాధించిన ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా అనకాపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామన్న మాటకు కట్టుబడి ఉన్నామని, దాని ఫలితమే ఈ జలయజ్ఞమని అన్నారు.

**మాట నిలబెట్టుకున్నాం.. పునర్నిర్మాణం చేస్తున్నాం**

గత ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని, ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించారని చంద్రబాబు గుర్తుచేశారు. "ఆ దీవెనల ఫలితమే నేడు అనకాపల్లికి గోదావరమ్మను తీసుకురావడం. మొన్న వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మను మార్కాపురానికి తరలించాం. ఈరోజు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరిని అనకాపల్లికి తీసుకొచ్చాం. ఇది ఒక చారిత్రక ఘట్టం" అని ఆయన అన్నారు. హెలికాప్టర్‌లో వస్తున్నప్పుడు తూర్పు కనుమలు, అడవులు, వాగులను దాటుకుని తరలివస్తున్న గోదావరి జలాలను చూసి ఎంతో సంతృప్తి కలిగిందని తెలిపారు. "అనకాపల్లి బెల్లం ఎంత తీయగా ఉంటుందో, ఈ రోజు అంతే తీయగా ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అని సీఎం వ్యాఖ్యానించారు.

**ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే జల ప్రణాళిక**

ఈ జల ప్రవాహం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది సింహాద్రి అప్పన్న చెంతకు, ఆ తర్వాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి పాదాల చెంతకు గోదావరి జలాలను తీసుకెళ్లి వంశధార నదికి అనుసంధానం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని నదులను అనుసంధానం చేసి తెలుగు తల్లికి జలహారతి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. "గలగల గోదావరి, బిరబిరా కృష్ణమ్మ అని పాటల్లో విన్నాం. ఇప్పుడు దానిని నిజం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ జల విజయం ప్రజల విజయం," అని ఆయన అన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి ఈ ప్రాజెక్టును అనుసంధానించి 12 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రూ. 3,200 కోట్లు ఖర్చు చేస్తామని, 2028 నాటికి వాటిని జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "2019 నాటికి మేము పోలవరం పనులను 72% పూర్తి చేశాం. కానీ తర్వాత వచ్చిన గడ్డలి పార్టీ నిర్లక్ష్యంతో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు గోదావరి పాలయ్యే పరిస్థితికి వచ్చింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు రూ. 500 కోట్లు కూడా ఖర్చు పెట్టని ఆ నాయకుడు, తన నివాసం కోసం రుషికొండలో ప్యాలెస్‌కు రూ. 500 కోట్లు ఖర్చు పెట్టారు. ఆ డబ్బుతో నాలుగైదు ప్రాజెక్టులు పూర్తయ్యేవి" అని ఆయన ఆరోపించారు. విశాఖకు డేటా సెంటర్ వస్తే నీరు, విద్యుత్ కొరత వస్తుందని ఇప్పుడు పేటీఎం బ్యాచ్‌తో ప్రచారం చేయిస్తున్నారని, కానీ ఐదు డేటా సెంటర్లకు అవసరమైన దానికంటే వందల రెట్లు ఎక్కువ నీటిని ఇచ్చే శక్తి తమకుందని స్పష్టం చేశారు. భోగాపురం, వెలిగొండలాగే ఈ ప్రాజెక్టు క్రెడిట్‌ను కూడా దొంగిలించేందుకు గత పాలకులు ప్రయత్నిస్తారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దార్శనికత**

"సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. జలం ఉంటేనే జీవం, జీవితం," అని చంద్రబాబు అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా మొత్తం 4 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందుతుందని, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని కేటాయిస్తామని వివరించారు. అదానీ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్, గ్రీన్ హైడ్రోజన్, సెమీ కండక్టర్, ఫార్మా వంటి పరిశ్రమలతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయని అన్నారు. "ఒకప్పుడు హైదరాబాద్ పక్కన రంగారెడ్డి ఎలా అభివృద్ధి చెందిందో, రేపు అనకాపల్లి మరో రంగారెడ్డి అవుతుంది. ఉత్తరాంధ్ర నుండి వలసలు పోవడం కాదు, ఉత్తరాంధ్రకే వలసలు వస్తారు. ఉత్తరాంధ్ర ఉత్తమాంధ్రగా, ఉన్నతాంధ్రగా మారుతుంది. ఇది ఖాయం, రాసిపెట్టుకోండి" అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**ప్రజలకు పిలుపు.. భవిష్యత్తుకు భరోసా**

గతంలో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టిసీమ, పురుషోత్తపట్నం ద్వారా నదుల అనుసంధానం చేశానని, ఇప్పుడు అనకాపల్లికి నీరు తెచ్చానని, రాబోయే మూడేళ్లలో రూ. 35,000 కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. "పాలకులం కాదు, మీకు సేవకులం. పదవి అంటే పెత్తనం కాదు, జవాబుదారితనం. మాకు అహంకారం లేదు, అంకితభావం ఉంది" అని అన్నారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా 'స్వర్ణాంధ్ర విజన్ 2047'తో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

**గోదారమ్మకు సాష్టాంగ ప్రణామం.. కాలువలో నిల్చొని చంద్రబాబు జలహారతి..**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల దాహార్తిని తీరుస్తూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా పయనించి వచ్చిన గోదావరి జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వద్ద క్రాస్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న గోదావరి జలాలకు, స్వయంగా కాలువలోనే నిల్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణ వర్ణంలో ప్రవహిస్తున్న గోదారమ్మకు పుష్పాలు సమర్పించి, జలహారతి ఇచ్చి తన కృతజ్ఞతను చాటుకున్నారు. పవిత్ర గోదావరి జలాలను శిరస్సుపై చల్లుకున్న అనంతరం, ఉద్విగ్నభరిత వాతావరణంలో గోదావరి ప్రవాహానికి సాష్టాంగ నమస్కారం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. బుధవారం పాయకరావుపేటలో జరిగిన ఈ చారిత్రక కార్యక్రమంలో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తొలుత శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, నారాయణ, అచ్చెన్నాయుడు, కొలుసు పార్థసారధి, ఎంపీలు చింతకాయల విజయ్, సీఎం రమేశ్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గోదావరి జలాలను ఉత్తరాంధ్ర జిల్లాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంప్రదాయ కోలాటంతో కళాకారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. రూ.4,192 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలవరం ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన ఈ నీటితో నాలుగు జిల్లాల పరిధిలో 2.87 లక్షల ఎకరాలకు సాగునీరు, 9 లక్షల మందికి తాగునీరు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 23.44 టీఎంసీల గోదావరి జలాలతో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని పారిశ్రామిక, తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ నీటితో అనకాపల్లి వద్ద ఏలేరు కాలువతో పాటు జిల్లాలోని 110 చెరువులను నింపేందుకు జలవనరుల శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనివల్ల పుష్కర, ఏలేరు, పంపా, తాండవ, వరహా, మామిడిగెడ్డ ఆయకట్టు కింద ఉన్న మొత్తం 46,620 ఎకరాలు స్థిరీకరణ కానున్నాయి. గోదావరి జలాలు తమ ప్రాంతానికి రావడంతో స్థానిక ప్రజలు, రైతులు ఆనందోత్సాహాలతో పులకించిపోయారు. కాలువకు ఇరువైపులా నిల్చుని ప్రవాహానికి అడుగడుగునా పుష్పాంజలి ఘటిస్తూ, హారతులు పడుతూ గోదారమ్మకు స్వాగతం పలికారు. తమ ప్రాంతానికి గోదావరి జలాలను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతు సోదరులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి అక్కడున్న ప్రజాప్రతినిధులు, అధికారులందరినీ స్వయంగా పిలిచి శిలాఫలకం వద్ద గ్రూప్ ఫోటోలు దిగారు.

# జనసేన యువజన విభాగం 'జై కొట్టు'

తెలియజేశారు. ఈ మేరకు బుధవారం వారు 'ఎక్స్' వేదికగా ప్రత్యేక పోస్టులు చేశారు. పవన్ కల్యాణ్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "ప్రియ మిత్రుడు, జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. పవర్‌స్టార్‌గా అభిమానుల గుండెల్లో మీరు సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు పవన్ నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన ప్రశంసించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా గిరిజన గ్రామాలకు రహదారుల అనుసంధానం, పచ్చదనం పెంపు వంటి కార్యక్రమాలతో ఆయన కీలక సంస్కరణలు తీసుకువస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ.. "దేవుడిచ్చిన అన్నయ్య పవన్ కల్యాణ్ గారు నిండు నూరేళ్లు ఆనంద ఆరోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు. పలు సేవా కార్యక్రమాలతో అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకలను నిర్వహించుకోవడం అభినందనీయమని లోకేశ్ పేర్కొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

మించిన ఆస్తుల కేసుకు సంబంధించిన విచారణలో భాగంగా జరుగుతున్నాయని ఏసీబీ వర్గాలు తెలిపాయి. ఈ సోదాలను అధికారులు బహుళ ప్రాంతాల్లో ఏకకాలంలో నిర్వహిస్తున్నారు. తిరుపతిలో లోకనాథం ఇద్దరు బావమరుదుల ఇళ్లలో, యెర్పేడు మండలం చెల్లూరులో ఉన్న ఆయన సోదరినివాసంలోనూ తనిఖీలు చేపట్టారు. తిరుమలలో లోకనాథంకు సంబంధం ఉందని భావిస్తున్న ఒక గెస్ట్ హౌస్‌లో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. విచారణలో భాగంగా తిరుపతి ఎస్టీవీ నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో ఉన్న లోకనాథం బ్యాంక్ లాకర్లను కూడా అధికారులు తెరిచి పరిశీలిస్తున్నారు. లోకనాథం ప్రస్తుతం శ్రీవారి ఆలయం టెంపుల్ డిప్యూటీ ఈవోగా కీలక బాధ్యతల్లో ఉండగా, గతంలో టీటీడీలో వివిధ హోదాల్లో పనిచేశారు. గత దశాబ్ద కాలంలో ఒక టీటీడీ ఉన్నతాధికారిపై ఏసీబీ సోదాలు నిర్వహించడం ఇది రెండోసారి. 2016లో అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి. భూపతి రెడ్డి నివాసంపైనా ఇదే తరహా ఆరోపణలతో ఏసీబీ దాడులు చేసింది. అప్పట్లో ఆయనకు సంబంధించిన 12 ఇంటి స్థలాలు, ఒక అపార్ట్‌మెంట్, నాలుగు అంతస్తుల భవనం పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం లోకనాథం ఆస్తులపై సోదాలు కొనసాగుతుండగా, పూర్తి వివరాలు తనిఖీల తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# వైఎస్సార్ 17వ వర్ధంతి.. ఇడుపులపాయలో జగన్ నివాళి

స్మరించుకుంటూ వారు అంజలి ఘటించారు. 2004 నుంచి 2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, 2009 సెప్టెంబర్ 2న 'రచ్చబండ' కార్యక్రమానికి వెళ్తూ నల్లమల అటవీ ప్రాంతంలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడుస్తున్నా, ప్రజలు ఆయన్ను నేటికీ స్మరించుకుంటూనే ఉన్నారు.

# పల్నాడు జిల్లాలో మంత్రి లోకేష్ పర్యటన

1,600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నిర్మించిన నూతన వసతి గృహాలను మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం హాస్టల్ మొత్తం కలియతిరిగి వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ వి.సంజనా సిమ్హా, జేఎన్ టీయూకే వైస్ ఛాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్, రాజ్యసభ ఎంపీ భాష్యం రామకృష్ణ, మంత్రి గొట్టిపాటి రవికుమార్, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి, భాష్యం ప్రవీణ్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ బీటీ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నేతన్నలకు పెట్టుబడిగా నూలు సరఫరా

పది రోజుల్లోగా లబ్దిదారులను ఎంపిక చేసి, ఆర్థిక సాయం అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల్లో చేనేత ఉత్పత్తులు, హస్త కళారూపాల అమ్మకాలు పెంచాలని, రానున్న పండగల నేపథ్యంలో డిస్కౌంట్ సేల్స్ ప్రారంభించాలని ఆయా శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుపై గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం చేనేత, జౌళి శాఖ, గ్రామీణ ఖాదీ బోర్డు అధికారులతో మంత్రి సవిత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల్లో చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, చేనేత, హస్త కళకారులు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారన్నారు. చేనేతలకు ఆర్థిక మేలు కలుగజేసేలా ఇప్పటికే పలు పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు రూ.25 వేల ఆర్థిక సాయం అందజేసేలా నేతన్నల సేవలో పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ పథకం అమలులో భాగంగా తొలి విడతగా 71,536 మంది నేతన్నలకు రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించామన్నారు. అర్హులైన మరింత మందికి ఈ పథకాన్ని వర్తింపజేయాలన్న ఉద్దేశంతో దరఖాస్తులు స్వీకరించగా, 36,632 మంది అప్లయ్ చేసుకున్నారన్నారు. రాబోయే పది రోజుల్లో వారిలో అర్హులను గుర్తించి, వీలైనంత తొందరగా రెండో విడత నేతన్నల సేవలో పథకం ద్వారా వారికి ఆర్థిక సాయం అందించాలని చేనేత, జౌళి శాఖాధికారులను ఆదేశించారు.

**పెట్టుబడిగా నూలు సరఫరా**

చేనేత వస్త్రాల తయారీలో ముఖ్యమైన నూలును పెట్టుబడిగా రుణ రూపేణా సరఫరా చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. నేతన్నలు తయారు చేసిన చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసిన తరవాత ఆప్కో అధికారులు సరఫరా చేసిన నూలు మొత్తాన్ని మినహాయించుకుని మిగిలిన చెల్లింపులు చేయాలన్నారు. ముందుగా నూలు అందజేయడం వల్ల నేతన్నలపై పెట్టుబడి భారం తగ్గుందని మంత్రి సవిత తెలిపారు.

**6న పెనుకొండలో ఆప్కో షో రూమ్ ప్రారంభం**

ఆప్కో, లేపాక్షి షో రూమల్లో చేనేత ఉత్పత్తులు, హస్త కళారూపాల విక్రయాలు పెంచాలని మంత్రి సవిత ఆదేశించారు. చేనేతలు, హస్త కళాకారులకు 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో అవసరమైన చోట ఆప్కో, లేపాక్షి షో రూమ్ లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల ఆరో తేదీన పెనుకొండలో ఆప్కో షో రూమ్ ఏర్పాటుకు తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. భోగాపురం ఎయిర్ పోర్టులో కూడా ఆప్కో, లేపాక్షి షో రూమ్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న పండగల నేపథ్యంలో చేనేత, హస్త కళలపై డిస్కౌంట్ సేల్స్ ప్రారంభించాలని మంత్రి సవిత తెలిపారు.

**ఉపాధి యూనిట్లపై అవగాహన సదస్సులు**

ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయిదేళ్లలో రాష్ట్రంలోని 20 లక్షల మంది యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మేనిఫెస్టోలో తెలిపిందన్నారు. ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు ద్వారా అందజేసే స్వయం ఉపాధి యూనిట్ల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖారాణి, ఖాదీ గ్రామీణా పారిశ్రామిభివృద్ధి బోర్డు సీఈవో సింహాచలం, లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'అది విధ్వంసక చర్యే'..

ఆలయంపై జరిగిన విధ్వంసకాండను ఖండిస్తున్నాం. ఇలాంటి ఘటనలు ఆ దేశంలో మైనారిటీల దుస్థితిని, అలాగే వారి మత స్వేచ్ఛ, ప్రార్థనా మందిరాల విషయంలో జరుగుతున్న ఉల్లంఘనలను స్పష్టం చేస్తున్నాయి. సంబంధిత ఘటనపై పాకిస్థాన్ ప్రభుత్వం తక్షణమే పారదర్శకంగా విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలి. అంతేకాకుండా.. ఆ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు చొరవ చూపాలి. మైనారిటీల భద్రత, వారి సాంస్కృతిక వారసత్వానికి భరోసా కల్పించాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరోవల్‌లోని సిరాజ్ గ్రామంలో ఉన్న ఆ ఆలయానికి సంబంధించిన స్థలాన్ని పక్కనే ఉన్న మదర్సాలో కలిపేందుకు మత ఛాందసవాదులు కూల్చివేతకు పాల్పడ్డారని స్థానిక ప్రజలు, మైనారిటీ సంస్థలు, రాజకీయ నేతలు పేర్కొన్నారు. అయితే, ఈ పాత ఆలయం భారీ వర్షాల కారణంగా ధ్వంసమయ్యిందని ప్రభుత్వం చెబుతోంది.

# మొక్కలే మానవుడి జీవిత నేస్తాలు

ఉంద'ని ఏపీ గ్రీన్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు అన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం ఇవ్వడానికి సమష్టిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణలో పాలు పంచుకుందాం అని పిలుపునిచ్చారు. చిలకలూరి పేటలోని ఆర్.వి.ఎస్.సి.వి.ఎస్ హైస్కూలులో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ గ్రీన్ సొసైటీ ఆధ్వర్యంలో 'వన క్షేమం - జన క్షేమం' కార్యక్రమంలో భాగంగా శ్రీ నాగబాబు గారి ఆధ్వర్యంలో స్కూలు పిల్లల సమక్షంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీ నాగబాబు గారు మాట్లాడుతూ "సమాజానికి ఏదైనా చేయాలనే తపతో మొక్కలను పెంచడం, వాటి వల్ల వచ్చే ప్రయోజనాలను చిన్నారులకు ఎన్నో విషయాలు చెప్పేవాడిని. నా మీద నమ్మకంతో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు గారు, గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తూ రాష్ట్రం పచ్చగా కళకళలాడేలా చేయాలన్నదే నా లక్ష్యం. బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి అధికారిక కార్యక్రమం చిన్నారులతో చేయడం ఆనందంగా ఉంది.

**చెట్టుఅనేది మన జీవితంలో భాగం కావాలి**

ఇల్లు నచ్చకపోతే వేరు ఇంటికి వెళ్లిపోతాం. ఓ ఊరు నచ్చకపోతే వేరే ఊరికి వెళ్లిపోతాం. అది నచ్చకపోతే దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం ఉంది. కానీ మొత్తం ప్రపంచమే నాశనం అయితే మానవాళికి మరో చోటు లేదు. గ్రహం లేదు. మనం ఇక్కడే ఉండాలి. ఉంటున్న చోటునే అందంగా, స్వచ్ఛంగా చేసుకోవాలి. దానికి మనమంతా కృషి చేయాలి. ప్రస్తుత తరానికి మా జనరేషన్ సారీ చెప్పాలి. విచక్షణరహితంగా పర్యావరణాన్ని ధ్వంసం చేసి మా తరం ఈ తరానికి అన్యాయం చేసింది. స్వార్థపూరిత మనుషులు ఎక్కువై చెట్లను కొట్టేశాం. చెట్టు అనేది మన జీవితంలో భాగం కావాలి. అవి మన జీవితాన్ని అత్యున్నతంగా కొనసాగించే మార్గాలు. మేం చిన్నపుడు చెట్ల కిందనే ఆడుకునే వాళ్లం.. వేసవిలో కూడా మాకు భయం లేకుండా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అయితే ఈ తరం వారు మళ్లీ ప్రేమతో మొక్కలను నాటుతున్నారు. వాటిని సంరక్షిస్తున్నారు. ఈ ప్రేరణ అందరిలోనూ రావాలి. జెన్ అల్ఫా, జెన్ బీటా తరం పెరిగి పెద్దయ్యాక పచ్చటి వాతావరణం ఇవ్వడానికి మేం కూడా తగిన విధంగా సహకరిస్తాం.

**ఒక మొక్క విలువ రూ.3 కోట్లు**

మొక్కలను పెంచడం వల్ల ఏమొస్తుందిలే అనుకోవద్దు. దీని వల్ల ఎన్నో లాభాలున్నాయి. ఏ మొక్క నాటినా అది పెరిగి చెట్టుగా మారితే ఇచ్చే ఫలాలు చిన్నవే కావొచ్చు.. పెద్ద లాభం ఏముందిలే అనుకోవచ్చు.. కానీ చెట్లు ఇచ్చే ఆక్సిజన్, పీల్చుకునే కార్బన్ డై ఆక్సైడ్, భూమిని సారవంతం చేయడానికి అది చేసే మేలును లెక్కిస్తే రూ.2 నుంచి కోట్ల సంపద ఇచ్చినట్లు అనుకోవాలి. చెట్టును చులకనగా చూడొద్దు. బిడ్డల భవిష్యత్తు కోసం ఆలోచించే వారంతా మొక్కలను నాటాలి. పిల్లలకు మొక్కలు నాటడం, వాటి సంరక్షణ అలవాటు చేయాలి. రాబోయే 20 ఏళ్లలో చక్కటి హరితహారంగా ఆంధ్రప్రదేశ్ తయారు అవుతుంది. దీనికి ప్రభుత్వం తగిన విధంగా సహకరిస్తుంది" అని అన్నారు. ఈ సమావేశంలో చిలకలూరి పేట ఎమ్మెల్యే శ్రీ పత్తిపాటి పుల్లారావు, ఆర్.వి.ఎస్.సి.వి.ఎస్ హైస్కూలు కరస్పాండెంట్ శ్రీ మైలవరపు శివానంద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరదల వేళ ఆపన్నహస్తం..

ప్రాంతాల్లో ఇప్పటివరకు 11,993 మందిని రక్షించినట్లు షా తెలిపారు. మరో 3,916 మంది గల్లంతైనట్లు పేర్కొన్నారు. మంత్రులంతా తమ నెల జీతాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో రూ.కోటి అత్యవసర నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఈ విపత్తు రసువా, నువాకోట్, ధాదింగ్ ప్రాంతాలకే పరిమితం కాదని.. దేశం మొత్తానికీ తీరని దెబ్బ అని షా పేర్కొన్నారు. ఈ సంక్షోభాన్ని "ధైర్యం, సంకల్పంతో ఎదుర్కోవడం తప్ప.. మాకు మరో మార్గం లేదు" అని చెప్పారు. విపత్తు అనంతరం భారత్ నేపాల్‌లో భారీ స్థాయిలో మానవతా, సాంకేతిక సహాయక చర్యలు చేపట్టింది. రెస్క్యూ బృందాలు, వైద్య నిపుణులు, డీఎన్ఏ ఆధారిత గుర్తింపు కోసం ఫోరెన్సిక్ నిపుణులను పంపింది. నేపాల్, చైనా అధికారులతో సమన్వయం కోసం విదేశాంగ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది.

# తొలి సీఈవోగా జితేంద్ర మిశ్ర

ఎంపికయ్యారు. మదన్‌మోహన్ పాండే (అయోధ్య), మహేశ్ భాగ్‌చంద్కా (దిల్లీ), డా.నిర్మలా యాదవ్ (శికోహాబాద్)లు కొత్త ట్రస్టీలుగా నియమితులయ్యారు. విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో అయోధ్య రామాలయంలో పరిపాలన, ఆర్థిక కార్యకలాపాల నిర్వహణను బలోపేతం చేసేందుకు ట్రస్టు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా సీఈవో నియామకం చేపట్టింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జితేంద్ర మిశ్ర 1986లో భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా చేరారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ వెస్ట్రన్ ఎయిర్ కమాండ్‌కు నాయకత్వం వహించారు. ఆ సమయంలో అందించిన సేవలకుగానూ యుద్ధసేవా పతకం పొందారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పదవీ విరమణ చేశారు. ఆయన పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, బెంగళూరులోని ఎయిర్ ఫోర్స్ టెస్ట్ పైలట్స్ స్కూల్ పూర్వవిద్యార్థి.

# పనుల్లో వేగం పెంచండి

విమానాశ్రయంలో కార్గో, ప్యాసింజర్ టెర్మినల్, ఎంఆర్ఓ(మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్) వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆదిలాబాద్‌లో రన్‌వే ఖరారుకు రక్షణ, పౌర విమానయన శాఖల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని, తెలంగాణలో హెలీ టూరిజం అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు సానుకూలంగా స్పందించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు రెండు వారాల్లో టెండర్లు పిలుస్తామని డిసెంబరులో పనులకు శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. హుస్సేన్‌సాగర్‌లో సీప్లేన్ ల్యాండింగ్‌కు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలియజేశారు. సమావేశంలో ఎంపీలతోపాటు సీఎస్ సంజయ్ జాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**విమానాశ్రయాల సమీపంలో నిర్మాణ అనుమతుల సరళీకరణ!**

దిల్లీ: విమానాశ్రయాల సమీపంలో భవన నిర్మాణ అనుమతులను సరళీకరించడంతోపాటు వేగవంతం చేసేందుకు గల అవకాశాలను కేంద్ర పౌర విమానయానశాఖ పరిశీలిస్తోంది. ఈ అంశంపై ఆ శాఖాధికారులు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సీనియర్ అధికారులతో రామ్మోహన్ నాయుడు సమావేశమయ్యారు. దరఖాస్తుదారులు ఎంత ఎత్తు కలిగి ఉన్న భవనాలు నిర్మించుకోవచ్చో ముందే తెలిపేందుకు గల అవకాశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

## ఎడిటర్ వాయిస్

# ఆ కీలక పదవి కోసం ఇద్దరు టాప్ లీడర్ల 'వారసత్వ'పోరు..!

మరోవైపు, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జెడ్పీ పీఠంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం.

విజయనగరం జిల్లా పరిషత్ పీఠం దక్కించుకోవడం కోసం జిల్లా రాజకీయాల్లో మళ్లీ రసవత్తర సమరం మొదలైంది. ఒకవైపు వైసీపీ అక్కడ బలంగా ఉండగా, ఇప్పుడు అధికార కూటమి కూడా అంతే పటిష్ఠంగా ఉనికి చాటుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని విజయనగరం మేయర్ స్థానంతో పాటు, ప్రతిష్టాత్మకమైన జెడ్పీ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకోవడానికి కూటమి భాగస్వామ్య పక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. మేయర్ పదవి టీడీపీ తీసుకుంటే, జెడ్పీ స్థానాన్ని తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు చర్చ జరుగుతోంది.

మరోవైపు, టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు జెడ్పీ పీఠంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. తన రాజకీయ వారసుడు రామ్‌మల్లిక్ నాయుడిని ఈ పదవిలో కూర్చోబెట్టి, ఆయనను స్థానిక రాజకీయంలో బలంగా నిలబెట్టాలని కళా వెంకటరావు భావిస్తున్నారు. కూటమి అధికారంలో ఉండటంతో జెడ్పీ పదవి సునాయాసంగా దక్కుతుందని, తద్వారా తన కుమారుడికి మంచి రాజకీయ వేదిక లభిస్తుందని అంచనా వేస్తూ ఆయన తెరవెనుక పావులు కదుపుతున్నారు.

అయితే, ఈ పీఠంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కూడా కన్నేశారు. ఆయన ఇప్పటికే తన కుమార్తె అనూషను రాజకీయ వారసురాలిగా ముందుకు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గత 15 ఏళ్లుగా విజయనగరం జెడ్పీలో బొత్స కుటుంబానిదే ఆధిపత్యం కావడంతో, ఈసారి కూడా ఆ పీఠాన్ని దక్కించుకుని తన కుమార్తెకు మంచి రాజకీయ భవిష్యత్తు ఇవ్వాలని బొత్స వర్గీయులు భావిస్తున్నారు. కొద్ది రోజులుగా అనూష రాజకీయంగా యాక్టివ్ అవుతున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పార్టీ నాయకులకు కావాల్సిన విషయాల్లో సహాయ సహకారాలు అందిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కిమిడి, బొత్స వారసులు ఇద్దరూ చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఏదో ఒక మండలం నుంచే జడ్పీటీసీగా పోటీ చేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గుర్ల, గరివిడి, మొరకముడిదాం మండలాలను వీరు టార్గెట్‌గా పెట్టుకుని రిజర్వేషన్ ఎక్కడ అనుకూలంగా వస్తే అక్కడ పోటీ చేయాలని చూస్తున్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చీపురుపల్లి నియోజకవర్గంలో బొత్స సత్యనారాయణపై కిమిడి కళా వెంకటరావు విజయం సాధించారు. ఇప్పుడు వీరిద్దరూ తమ తమ వారసులను జెడ్పీ రేసులో నిలిపేందుకు సిద్ధమవుతుండటంతో, విజయనగరం జెడ్పీ పీఠం కోసం మరోసారి బొత్స వర్సెస్ కిమిడి మధ్య ఆసక్తికర పోరు ఖాయంగా కనిపిస్తోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైమ్ వాయిస్

### ప్రియుడితో కలిసి భర్త హత్య.. పట్టించిన మద్యం సీసా మూత



**ఆళ్లగడ్డ, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని ప్రియుడితో కలిసి భార్యే తన భర్తను హత్య చేయించింది. ఈ ఘటన ఏపీలోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో చోటుచేసుకుంది. పోలీసులు ఈ కేసును 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసు వివరాలను ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆళ్లగడ్డకు చెందిన ఆంజనేయులు(32) పట్టణ శివారులోని సమీప పొలాల్లో మంగళవారం ఉదయం విగతజీవిగా కనిపించాడు. సమాచారం అందుకున్న సీఐ నాగరాజారావు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. తలపై ఎవరో బండరాయితో మోది అతడిని హత్య చేసినట్లు గుర్తించారు. భార్య సుబ్బులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. అయితే, భార్యపై అనుమానం రావడంతో ఆ దిశగా విచారణ చేపట్టిన పోలీసులు.. చాగలమర్రి మండలం తోడేళ్లపల్లె గ్రామానికి చెందిన గురు ప్రసాద్‌తో సుబ్బులుకు వివాహేతర సంబంధం ఉన్నట్లు గుర్తించారు. తమ అక్రమ సంబంధానికి అడ్డువస్తుండటంతో భర్తని హత్య చేసేందుకు సుబ్బులు వ్యూహరచన చేసింది. సోమవారం రాత్రి ప్రియుడితో భర్తకు ఫోన్ చేయించింది. గురు ప్రసాద్ తనవెంట ప్రొద్దుటూరుకు చెందిన షరీఫ్‌ను వెంట తీసుకొచ్చాడు.. ముగ్గురూ కలిసి పట్టణ శివారులో మద్యం తాగారు. అనంతరం మత్తులో ఉన్న ఆంజనేయులు తలపై గురు ప్రసాద్ మద్యం సీసాతో కొట్టి, బండరాయితో కొట్టి చంపాడు. అనంతరం ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో మద్యం సీసా మూతపై ఉన్న క్యూఆర్ కోడ్ సాయంతో పోలీసులు.. దానిని ఎవరు, ఏ షాప్‌లో కొనుగోలు చేశారనేది సీసీటీవీ కెమెరాల ద్వారా గుర్తించి నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు తెలిపారు.

### యూకేలో ఎంబీఏ.. బాసర బ్రిడ్జిపై నుంచి పడి యువకుడి మృతి



**నవీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నిర్మల్ జిల్లా బాసరలో విషాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం కౌల్పూర్ గ్రామానికి చెందిన రమావత్ సాయికిరణ్ (25) గోదావరి నదిలో పడి చనిపోయాడు. యూకేలో ఎంబీఏ చేస్తున్న అతడు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 5న తిరిగి యూకే వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం బాసర ఆలయానికి సాయికిరణ్ వెళ్లాడు. దర్శనం అనంతరం బ్రిడ్జిపై ఫొటోలు దిగుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడిపోయాడు. విషయం తెలుసుకుని కుటుంబసభ్యులు గాలింపు చేపట్టగా బుధవారం అతడి మృతదేహం లభ్యమైంది. తండ్రి రమావత్ భోజారామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పీఎస్‌లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కాకినాడలో దారుణం
#### స్నేహితుల మధ్య వివాదం.. యువకుడి దారుణ హత్య!

**కాకినాడ, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలోని సాంబమూర్తి నగర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా నివాసముండే గిరిధర్ (37) అనే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు అతికిరాతకంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళ్తే సాంబమూర్తి నగర్ ప్రాంతంలో గిరిధర్‌పై తీవ్రస్థాయిలో దాడి జరగడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు గిరిధర్‌కు తన స్నేహితులతో గత కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని, ఆ వివాదాలే ఈ హత్యకు దారితీసి ఉండవచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి ఘటనా స్థలంలో కీలక ఆధారాలు, వేలిముద్రలను సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. హత్యకు పాత కక్షలే కారణమా? లేక క్షణికావేశంలో జరిగిన గొడవా? అనే కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

### డీజే సౌండ్‌కు గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతి



**నారాయణపేట, సెప్టెంబర్ 02, విశ్వం వాయిస్ న్యూస్ :** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని పోతిరెడ్డిపల్లికి చెందిన దస్తయ్య, లక్ష్మీ దంపతులకు కుమారుడు రవితేజ (17). స్నేహితుడి ఇంట్లో పెళ్లి ఉండటంతో రాత్రి అక్కడికి వెళ్లాడు. స్నేహితుడి ఇంట్లో పెళ్లి సందడిలో డీజే సౌండ్‌కు డ్యాన్స్ చేస్తూ హఠాత్తుగా కుప్పకూలాడు. స్నేహితులు, స్థానికులు అతడిని కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్లు వెల్లడించారు. డీజే సౌండ్ వల్ల ఇప్పటికే ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరిగాయి. ప్రభుత్వాలు డీజేలు వినియోగించవద్దని హెచ్చరిస్తున్నా.. డీజే లేకుండా ప్రజలు ఎలాంటి ఫంక్షన్లు చేసుకోవడం లేదు.

#### టోల్‌ప్లాజా వద్ద
### దగ్ధమైన టాటా ఏస్ వాహనం



**ప్రకాశం జిల్లా, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా ఏల్చూరు టోల్‌ప్లాజా వద్ద టాటా ఏస్ వాహనం దగ్ధమైంది. రహదారి మరమ్మతు పనుల కోసం వచ్చిన కూలీలను తీసుకువెళ్తుం డగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కూలీలను కిందకు దించేశారు. కాసేపటికే మంటలు విస్తరించి వాహనం కాలిపోయింది. టోల్ సిబ్బంది స్పందించి మంటల్ని ఆర్పివేశారు.



# ప్రజా సంక్షేమ పాలన జలయజ్ఞం ప్రదాత వైఎస్సార్

## ఎందరికో విద్య వైద్యం అందించిన మహానేత : ఎమ్మెల్సీ తోట - ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి

**మండపేట టౌన్, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట రాజారత్న సెంటర్ వైయస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి నాయకులు మరియు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. విజయలక్ష్మి నగర్ లో ఉన్న వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యాలయం నుంచి నాయకులు కార్యకర్తలతో కలిసి పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్ మరియు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రాజరత్న సెంటర్లో ఉన్న వైయస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని జలయజ్ఞం ప్రదాత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ప్రజా సంక్షేమ పాలనకు సరికొత్త నిర్వచనం చెబుతూ ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్మెంట్, అత్యవసర సేవలైనటువంటి 108,104 అంబులెన్స్ లు, జలయజ్ఞం, నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం లాంటి విప్లవాత్మక పథకాలతో కోట్ల మంది కార్మిక, రైతు, పేద వర్గాల గుండెల్లో మహానేతగా శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. 1949 జూలై 8న జన్మించిన వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంబీబీఎస్ పూర్తిచేసి హౌస్ సర్జన్ చేశారని రూపాయి డాక్టర్ గా ప్రజాభిమానాన్ని పొందారన్నారు, ఆయన రాజకీయ జీవితంలో ఏనాడూ ఓటమిని చూడలేదని పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుండి 6 సార్లు ఎమ్మెల్యేగా, కడప పార్లమెంటు స్థానం నుండి 4 సార్లు లోక్ సభ ఎంపీగా వరుసగా విజయపరంపరం సాగిస్తూ గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య విద్యా శాఖల మంత్రిగా ప్రజా సేవలో అలుపెరగని పోరాటంతో ఎంతోమంది రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయంగా ముందుకు సాగిన రాజశేఖర్ రెడ్డి అని గుర్తుచేశారు. అప్పటి తెలుగుదేశం



పార్టీ అరాచక పాలనతో ఉమ్మడి రాష్ట్ర ప్రజలందరూ కూడా ఆర్థికంగా అప్పులు పాలై ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా సాగుతున్న ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 9 ఏప్రియల్ 2003లో చారిత్రక ప్రజాప్రస్థానం పాదయాత్రను చేవెళ్ల నుండి ఇచ్చాపురం వరకు రంగారెడ్డి జిల్లాలో ప్రారంభించి 68 రోజులపాటు ఎండనక వాననక 1475 కిలోమీటర్లు కాలినడకన ప్రజల మధ్యలో నడుస్తూ ప్రజలతో మమేకమై మహిళలు, వృద్ధులు, రైతులు, పేదల కష్టాలను స్వయంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని 2004లో అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెనువెంటనే రైతులకు ఉచిత విద్యుత్తు పై తొలి సంతకం చేసి పాత బాకీలను రద్దు చేసినటువంటి ఘనత రాజశేఖర్ రెడ్డి దేనని కొనియాడారు. 2 రూపాయలకే కిలో బియ్యం, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ రుణాలు, 86 భారీ మధ్య తరహా ప్రాజెక్టులతో జలయజ్ఞం నీటిపారుదల ప్రాజెక్టుల మహా విప్లవాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారని వాటి ద్వారా కోటి ఎకరాలకు సాగునీటిని అందించారన్నారు. 2004 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఉచిత కరెంటు పై విమర్శలు చేస్తూ మీరిస్తానన్న ఉచిత కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవడానికి పనిచేస్తాయని విమర్శించిన మాటలకు దివంగత నేత రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన మాటకు నిలబడి రైతులకు ఉచిత కరెంటును అందజేసిన ఘనత వైయస్సార్ కే చెందుతుందన్నారు. ప్రస్తుత ఈ కూటమిపాలనలో రైతులకు అడుగడుగున అన్ని ఇబ్బందులేనని భూగర్భజలాలు అట్టడుగికి వెళ్ళిపోయాయిన ఇబ్బందులను చూసిన దేవదేవుడు వైయస్సార్ వర్ధంతి రోజున జలయజ్ఞ ప్రదాత పాలనను వర్షం రూపంలో గుర్తుచేశారని స్వర్గంలో ఉన్నటువంటి రాజశేఖర్ రెడ్డి ఆశీస్సులతో రాబోయేది వైఎస్ఆర్సిపి జగన్మోహన్ రెడ్డి పాలనేనని తెలియచేస్తూ మహానేత రాజశేఖర్ రెడ్డి కి రాష్ట్ర ప్రజల తరఫున మండపేట నియోజకవర్గం వైఎస్ఆర్సిపి పార్టీ తరపున నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రాష్ట్ర రైతు కిసాన్ సెల్ సెక్రెటరీ రెడ్డి రాజబాబు, పార్టీ టౌన్ రూరల్ కన్వీనర్లు పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి, వెలగల సత్యనారాయణరెడ్డి, గూటం సత్యనారాయణ, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీలు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్పొరేషన్ డైరెక్టర్లు పార్టీ గ్రామ వార్డు అధ్యక్షులు, రాష్ట్ర జిల్లా మరియు నియోజకవర్గం అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, మహానేత అభిమానులు పాల్గొన్నారు.

### ఒకటి అడిగితే ఇంకోటి చెప్పడం

# తోట త్రిమూర్తులు నైజం

## కోరుమిల్లి ఇళ్లు కూల్చింది తమ అనుచరుడు కదా?

## మాట మీద నిల్చునే తత్వం తోట త్రిమూర్తులుకు లేదు : ఎమ్మెల్యే వేగుళ్ళ ఫైర్



**మండపేట టౌన్, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గత ఏడు సంవత్సరాలుగా మాటల గారడీ చేస్తున్నారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు.నందంటే పందంటారన్నారు.టిడ్కో లో ఎందరున్నారో లెక్కించండనీ పేర్కొన్నారు. కోరుమిల్లి ఇళ్లు కూల్చింది తమ అనుచరుడు సలాది వీరబాబు కదాఅని ప్రశ్నించారు.మాట మీద నిల్చునే తత్వం తోట త్రిమూర్తులు కు లేదన్నారు. తోట అసత్య ప్రచారం పై వేగుళ్ళ జోగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తోట మాటల గారడి ఇవాళ నిజమని తేలిందని విమర్శించారు. ఒకటి అడిగితే ఇంకోటి చెప్పడం ఆయన అలవాటన్నారు. కిరాణా కొట్లో బెల్లం ఉందా అంటే పంచదార ఉందని చెప్పినట్లుగా ఉంది ఆయన తీరని ఆయన ఎద్దేవా చేశారు. తోట త్రిమూర్తులు ఎమ్మెల్యే అయినప్పుడు మీ ఆస్తులు ఎంత ఇప్పుడు ఎంత ఉందని తాను ఎమ్మెల్యే అయినప్పుడు తన ఆస్తులు ఎంత? ఇప్పుడు ఎంత? తోట కి నచ్చిన జడ్జి, ప్లీడర్, ఆడిటర్ కు ఇద్దరం ఆస్తులు ఇద్దామన్నానని పేర్కొన్నారు. వాళ్లే లెక్క తేల్చి ప్రెస్ కు రిలీజ్ చేస్తారని సవాల్ విసిరారు.అఫిడవిట్ లో చూపించినవి కాదన్నారు. ఒరిజినల్ గా ఎవరి పేరు మీద ఉన్నా సరే బయటపెట్టాలని పేర్కొన్నారు. ఒకవేళ ప్రకటించిన దానికంటే ఎక్కువ ఆస్తి తన దగ్గర ఉందని తోట నిరూపిస్తే ఆ ఆస్తిని తోటకు రాసిస్తానని పేర్కొన్నారు. అదే తోట దగ్గర అదనపు ఆస్తి తాను పట్టుకుంటే తనకు రాసివ్వాలని ఆయన ఓపెన్ ఆఫర్ ఇచ్చారు. మధ్యలో చంద్రబాబు, జగన్, ఎన్టీఆర్, వైఎస్ఆర్ లను తీసుకురావద్దని సలహా ఇచ్చారు. ఇది తమ ఇద్దరి మధ్య విషయమేనని స్పష్టం చేశారు.కోరుమిల్లి చెరువు గట్టు తొలగించిన ఇళ్లు లేనివాళ్లవా ఉన్నవాళ్లవా అని ప్రశ్నించారు. 2012లో మాజీ సర్పంచ్ సలాది వీరబాబు కంటెంప్ట్ వేశారని చెప్తున్నారు, మరి ఇవాళ వీరబాబు ఎవరి పార్టీలో ఉన్నారో చెప్పాలని నిలదీశారు. టిట్కోలో 2000 మంది కూడా కాపురం ఉండటం లేదని తోట అంటున్నారని, నమ్మకస్తులైన నలుగురిని పంపి లెక్కపెట్టించుకోవాలని సవాల్ చేశారు. వాస్తవం ఎంతమంది ఉన్నారో స్వగతంలోనైనా ఒప్పుకోవాలని సూచించారు. వేములపల్లిలో 4,893 మందికి ఇచ్చిన స్థలాల్లో 1400 మందికి గోతులే ఇచ్చారని ఎద్దేవా చేశారు. అందులో కేవలం 250 మంది మాత్రమే కాపురం ఉంటున్నారని వివరించారు. మిగిలినవి తోట అనుచరులు పనులు మొదలుపెట్టి గాలికి వదిలేసి లబ్ధిదారులనుండి డబ్బులు తినేశారని ఆరోపించారు. మెట్లు ఊడిపోతున్నాయి, ఫ్లాట్లు పడిపోతున్నాయనీ తోట అంటున్నారని, దాన్ని మొదలుపెట్టించింది ఎవరు, పూర్తి చేయించింది ఎవరో ఆలోచించాలని అన్నారు.నందంటే పందని, పందంటే నందని అనే మాటలు వద్దన్నారు. తోట కు నచ్చిన జడ్జి చే ఆస్తులు వివరాలు ఇచ్చేశామని ఒక్క ఫోన్ చేయించండి, వెంటనే తాను కూడా తన ఆస్తులు వివరాలు ఇస్తానని సవాల్ చేశారు.

# పవర్ ఫుల్‌గా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు


## పండగ వాతావరణంలో మండపేట - కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** డిప్యూటీ సీఎం, జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మండపేటలో ఘనంగా జరిగాయి . పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఫుల్ జోష్ చూపించారు. మండపేట మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా పవన్ కళ్యాణ్ అభిమానులు, జన సేన కార్యకర్త లే కనిపించారు. పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించాల్సిన వేడుకలను బుధవారం ఒకే వేదికపై ఘనంగా నిర్వహించారు. మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జి, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సీతారామ కమ్యూనిటీ హాలులో ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి లీలా కృష్ణకు తినిపించారు. పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జనసైనికులు, అభిమానుల నినాదాలతో కమ్యూనిటీ హాలు సందడిగా మారింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, సమాజ సేవే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ సామాన్య ప్రజల ఆకాంక్షలకు అండగా నిలిచిన ఆయన, ప్రస్తుతం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రజా పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆలోచనలు, ఆశయాలు, సేవా స్ఫూర్తితో జనసైనికులంతా ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, మరెన్నో



సంవత్సరాలు ప్రజలకు సేవ చేసే అవకాశం భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా ఫణి రచించిన రామో రామ లింగ నూతన గీతాన్ని ప్రదర్శించారు. పవన్ కళ్యాణ్ ప్రజా సేవా ప్రస్థానం, ఆయన చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలు, తెలంగాణతో ఆయనకున్న అనుబంధాన్ని ప్రతిబింబించే అరుదైన దృశ్యాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రదర్శించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు, అభిమానులు తరలి వచ్చారు. మండపేట ప్రభుత్వ ఆసుపత్రి లో రోగులకు, బాలింత లకు పండ్లు రొట్టెలు వేగుళ్ళ లీలా కృష్ణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జన సేన టౌన్ అధ్యక్షులు నామాల చంద్రరావు, మూడు మండల జన సేన అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# కొత్తపేటలో ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు.. పలు సేవా కార్యక్రమాలతో సందడి

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న యువ నాయకుడు బండారు సంజీవ్

**రావులపాలెం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కొత్తపేటలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు, యువ నాయకుడు బండారు సంజీవ్ పాల్గొన్నారు. కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానుల సమక్షంలో బండారు సంజీవ్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సంబరాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరం, కంటి వైద్య శిబిరాల్లో బండారు సంజీవ్ పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా బండారు సంజీవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు భగవంతుడు సంపూర్ణ



ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించి ఉన్నత శిఖరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. నియోజకవర్గానికి సంబంధించిన ఏ సమస్యనైనా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు, దాని పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని సంజీవ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ సహకారంతో కొత్తపేట నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.








సీఎం పర్యటనకు శాఖల వారీగా

# సమగ్ర నివేదికలతో సిద్ధంగా ఉండాలి : కలెక్టర్ మహేష్



**అమలాపురం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఈ నెల 9వ తేదీన డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్య టించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికా రులను ఆదేశించారు. పి.గన్నవరం నియోజక వర్గంలోని అంబాజీపేట మండలంలో ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బుధవారం జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పర్యటన ఏర్పాట్లు, శాఖల వారీగా సిద్ధం చేయాల్సిన నివేదికలపై దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ప్రధానంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అదే సమయంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయం, సానుకూలత (పబ్లిక్ పర్సెప్షన్) తదితర అంశాలపై ముఖ్యమంత్రి వేదికపైనే సమీక్ష నిర్వహించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి శాఖ అధికారి తమ శాఖ పనితీరు, పురోగతి, ప్రజల్లో ఉన్న అభిప్రాయంపై పూర్తి అవగాహనతో సిద్ధంగా ఉండాలని సూచించారు. గత రెండేళ్లతో పాటు గత ఏడాది, గత ఆరు నెలల కాలంలో తమ శాఖపై ప్రజల్లో ఉన్న సానుకూల అభిప్రాయం ఏ విధంగా ఉందో అధికారులు విశ్లేషించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏదైనా శాఖపై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఉంటే అందుకు గల కారణాలను గుర్తించాలని, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు, సాధించిన పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన సమాచారంతో నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పాజిటివ్ పర్సెప్షన్ తక్కువగా ఉన్న శాఖలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నందున ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయి సిబ్బందితో చర్చించి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడంతో పాటు తాజా గణాంకాలతో సమగ్ర నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖకు సంబంధించి యూరియా, ఎరువుల లభ్యత, ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై పూర్తి వివరాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పౌరసరఫరాల శాఖలో సీజనల్ ధాన్యం కొనుగోళ్లు, రేషన్ పంపిణీ, లబ్ధిదారులకు అందుతున్న సేవల వివరాలతో పాటు ఇరిగేషన్ శాఖ పనితీరు, ప్రాజెక్టులు, సాగునీటి సరఫరా తదితర అంశాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా వేదికపై శాఖల వారీగా సమీక్ష జరిగే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పూర్తి సమాచారంతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా గణాంకాలు, నివేదికలు సిద్ధం చేసుకుని ముఖ్యమంత్రి సమీక్షకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.

అపర భగీరథుడు వైఎస్సార్..

# జలయజ్ఞంతో రైతాంగానికి జీవం పోసిన మహానేత

వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా జలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**రావులపాలెం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా రావులపాలెంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద ఆయన విగ్రహానికి జలాభిషేకం చేసి, అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రానికి ముఖ్యమంత్రులు ఎంతోమంది వచ్చారు, వెళ్లారు కానీ రైతాంగం, పేదలు, సామాన్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ తర్వాత గోదావరి ప్రాంత అభివృద్ధి, సాగునీటి రంగంపై అంతటి దృష్టి పెట్టిన నాయకుడు వైఎస్సార్ అని పేర్కొన్నారు. జలయజ్ఞం ద్వారా భారీగా నిధులు కేటాయించి లక్షల ఎకరాలను సాగులోకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో కాలువల ఆధునీకరణకు భారీగా నిధులు కేటాయించి సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసిన వైఎస్సార్.. కోనసీమ ప్రాంతంలో గోదావరి వరదల సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఏటిగట్ల బలోపేతానికి వందల కోట్ల రూపాయలు వెచ్చించారని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో కూడా సుమారు రూ.100 కోట్లతో ఏటిగట్లను బలోపేతం చేసి ప్రజలకు వరద భయాన్ని దూరం చేసిన ఘనత వైఎస్సార్‌దేనన్నారు. పోలవరం, వెలిగొండ వంటి కీలక ప్రాజెక్టులకు వైఎస్సార్ హయాంలోనే పనులకు వేగం వచ్చిందని, గతంలో కేవలం శంకుస్థాపనలకే పరిమితమైన ప్రాజెక్టులను వైఎస్సార్ నిధులు కేటాయించి ముందుకు తీసుకెళ్లారని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వైఎస్సార్ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కూడా అనేక ప్రాజెక్టులు, మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు పునాది పడిందని చెప్పారు. ఎవరో వేసిన పునాదులపై చివర్లో రిబ్బన్ కట్ చేసి మొత్తం క్రెడిట్ తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబు నాయుడి రాజకీయ నైజంగా మారిపోయిందని చిర్ల జగ్గిరెడ్డి విమర్శించారు. గత ప్రభుత్వాలు, వైఎస్సార్, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన పనులకు పేర్లు మార్చి తమ ఘనతగా చెప్పుకోవడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమేనన్నారు. పచ్చ మీడియా ప్రచారంతో వాస్తవాలను ప్రజల కళ్లకు కనిపించకుండా చేయలేరని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఇతరులు చేసిన పనులకు పేర్లు పెట్టుకునే రాజకీయాలను పక్కన పెట్టి.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగాలు, రైతులకు యూరియా, రైతులకు ఇచ్చిన ఆర్థిక హామీలు, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ వంటి అంశాలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో కూడా గతంలో వైఎస్సార్ హయాంలో మంజూరై, ప్రారంభమై, పూర్తయిన అభివృద్ధి పనులకు కొత్త పేర్లు పెట్టుకుని రాజకీయ ప్రచారం చేసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. అభివృద్ధి పనుల వాస్తవ చరిత్రను ప్రజలు తెలుసుకుంటున్నారని, పేర్లు మార్చినంత మాత్రాన చరిత్ర మారదని, ప్రజల జ్ఞాపకాలను చెరిపేయడం ఎవరి వల్లా కాదని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రైతులకు సాగునీరు, పేదలకు సంక్షేమం, ప్రజలకు భరోసా కల్పించిన మహానేత వైఎస్సార్‌ను ఆయన వర్ధంతి సందర్భంగా జలాభిషేకంతో స్మరించుకోవడం ఎంతో గర్వకారణమని చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజల తరఫున నిరంతరం పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు.

# ఈతకోటలో ఘనంగా పవన్ కళ్యాణ్ 56వ జన్మదిన వేడుకలు



**రావులపాలెం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** పవనిజం సేవా సమితి- వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షులు. ప్రజా సేవకుడు గండ్రోతు దుర్గాసురేష్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు. కూటమి నాయకులు, యువకులు స్థానిక గ్రామ పంచాయతీ వీధిలోని కమ్యూనిటీ హాల్ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అభిమానులు రావులపాలెం. ఘనంగా జరిగిన సమాజ సేవకుడు ప్రజా నాయకుడు జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు జనసేన పార్టీ అధ్యక్షులు. ఎన్డియే కూటమి నేత.కొణిదెల పవన్ కళ్యాణ్ 56వ పుట్టినరోజును పురస్కరించుకుని మండలం పరిధిలోని ఈతకోట గ్రామంలో ఆయన అభిమానులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు భరతమాత సేవలో ముందుకు సాగుతు సమాజంలో మార్పు కోసం పరితపిస్తున్న జనసేన పార్టీ అధినేత, ప్రకృతి ప్రేమికుడు. పర్యావరణ పరిరక్షకుడు,ఎన్డియే కూటమి నేత. ప్రజా నాయకుడు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా బుధవారం నాడు పవనిజం సేవా సమితి -వివి వినాయక్ సేవా యూత్ సర్కిల్ అధ్యక్షులు ప్రజా సేవకుడు గండ్రోతు దుర్గాసురేష్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక గ్రామ పంచాయతీ వీధిలోని కమ్యూనిటీ హాల్ రామాలయంలో పలు ఆలయాల్లో అర్చకులు ఖండవల్లి శ్రీనివాసాచార్యులు పవన్ కళ్యాణ్ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు రాష్ట్ర దేశ అభివృద్ధి ప్రజా సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్న ఆయన ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా క్షేమంగా వర్ధిలుతూ ఉండాలని శ్రీ విఘ్నేశ్వరస్వామివారిని శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ స్వామివార్లను దేవత మూర్తులను పూజించి అభిమానులు వేడుకున్నారు కమ్యూనిటీ హాల్ రామాలయం వద్ద ప్రజా సేవకుడు దుర్గా సురేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ను కూటమి నాయకులు గ్రామ పెద్దలు. టీడీపీ గ్రామ అధ్యక్షులు మిరియాల రాము. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు యరంశెట్టి రాంమోహన్ రావు (రాము ) బీజేపీ గ్రామ అధ్యక్షులు గండ్రోతు వీరగోవిందరావు.ఎమ్ ఆర్ పిఎస్ నాయకులు కొడమంచిలి చిరంజీవి.పెద్దలు మాజీ సర్పంచ్ మాధవరపు సాయిబాబు మాజీ ఎంపీటీసి గండ్రోతు రాజు. జనసేన వీర మహిళా గండ్రోతు దుర్గాదేవి.అభిమానులు చేతులు మీదుగా కేక్ కటింగ్ నిర్వహించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు చిన్నారులకు యువకులకు పెద్దలకు చాకెలెట్స్ బిస్కెట్లు అందజేసి పలువురు అభిమానులు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అపారమైన అభిమానాన్ని సంపాదించుకున్న నటుడిగా మాత్రమే కాకుండా, ప్రజల కోసం నిరంతరం ఆలోచించే సేవాభావి ప్రజా నాయకుడిగా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న పవన్ కళ్యాణ్ అందరికి ఆదర్శప్రాయులన్నారు. ఈ కార్యక్రమంలో చిక్కాల శంకర్, బొరుసు సుబ్రహ్మణ్యం, గండ్రోతు గౌతమ్.గుబ్బల రామ్మోహన్ రావు (రాము), గండ్రోతు రామకృష్ణ, గోపిశెట్టి దావీదు.పల్లికొండ దుర్గాప్రసాద్, గండ్రోతు సత్యనారాయణ, మోటూరి గణేశ్వరరావు, జనిపిరెడ్డి వెంకటేశ్వరరావు (వెంకన్న) చింతపల్లిరాముడు, మోటూరి మహేంద్ర, నరాలశెట్టి వెంకన్న, ఆకుల సత్తిబాబు, కర్రి శ్రీను, బండారు వాసు, నామన గాంధీ, యర్రంశెట్టి వీర వెంకట సత్యనారాయణ (కాసు), చింతపల్లి సత్యనారాయణ(బూరి), పొట్టిపోతు వెంకన్న.మోటూరి శ్రీను.కొప్పినీడి సత్తిపండు, నాగిరెడ్డి చంద్రశేఖర్,మోటూరి సత్యనారాయణ.సజ్జా సాయిరాం.దామోదర్ భాస్కరరావు పురం శ్రీను.చింతపల్లి ప్రసాద్.జనిపిరెడ్డి మహేష్.కరాటపు గణపతి.యర్రంశెట్టి ఆదినారాయణ,గంగుముళ్ల శ్రీనివాస్.నాగిరెడ్డి దుర్గారావు, జనిపిరెడ్డి అశోక్.గండ్రోతు గోపాలరావు (గోపి).ఏపుగంటి వెంకటేష్.సజ్జా మహేష్. కొండేపర్తి మురళీ.గండ్రోతు అశోక్. మెగా అభిమానులు. కూటమి నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల మెడలో చైన్ల దొంగతనం కేసులో

## ముద్దాయికి తొమ్మిది నెలల జైలు శిక్ష

**ద్రాక్షారామ, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ, వెంకటాయపాలెం, సర్పవరం, కాకినాడ, కరప, రాయవరం గ్రామాలలో మహిళల మెడలో నుంచి చైన్లు దొంగతనం చేసిన ముద్దాయి సాధనాల వెంకటేష్ (తండ్రి: నరసింహారావు, వయసు: 35 సంవత్సరాలు, నివాసం: గుత్తినదీవి, ఐ.పోలవరం మండలం)ను ద్రాక్షారామ ఎస్.ఐ. ఎం. లక్ష్మణ్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. వాదోపవాదనల అనంతరం నిన్నటి రోజున అనగా 2-9-2026 తేదీన ఏ.జే.ఎఫ్.సీ.ఎం. జడ్జి ఎన్. శారద గారు ఈ కేసులో ముద్దాయికి 9 నెలల జైలు శిక్ష విధించినట్లు ద్రాక్షారామ ఎస్.ఐ. ఎం. లక్ష్మణ్ తెలియజేసినారు. ఈ కేసును ఏ.పి.పి. బి. రామతులసి వాదించినారు.

# బండారులంకలో ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు



**బండారులంక, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరిం చుకుని బండారులంకలో జనసేన పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, సమాజంలో మార్పు కోసం నిరంతరం శ్రమిస్తున్న పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా జనసేనాని ఆశయాలకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని పేర్కొన్నారు. బండారులంకలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక ప్రజలు, చేనేత కార్మికులు, ఇతర లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, బండారులంక గ్రామ నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు, వైద్య బృందం పాల్గొన్నారు.

# విదేశీ పక్షుల వేటగాళ్లపై నిఘా హర్షణీయం : ఎమ్మెల్సీ కుడుపూడి



**అమలాపురం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** విదేశీ పక్షుల వేటగాళ్లపై అటవీశాఖ అధికారులు నిఘా ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. అమలాపురంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విదేశీ పక్షులను వేటాడుతున్న వేటగాళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అటవీశాఖ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఢిల్లీ సాయికృష్ణ వెల్లడించడం సంతోషకరమన్నారు. బి.దొడ్డవరం సమీపంలోని లంక ప్రాంతంలో విదేశాల నుంచి వలస వచ్చి విడిది చేసిన ఓపెన్ బిల్డ్ స్టార్క్ పక్షులను మంగళవారం అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి పర్యవేక్షించడం, వేటగాళ్లపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ప్రకటించడం ఆహ్వానించదగ్గ పరిణామమని తెలిపారు. కొద్దిరోజుల క్రితం అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇదే విషయంపై ఫిర్యాదు చేశామని, దీనిపై స్పందించిన అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటామని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. విదేశీ పక్షులను వేటాడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్సీ కోరారు. పక్షులను వేటాడుతున్నట్లు గుర్తిస్తే అటవీశాఖ అధికారులు, పోలీసులకు ప్రజలు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సేవే పరమార్ధంగా కాజులూరులో

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

అన్నదానం, విద్యార్థులకు కిట్లు, పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

ముఖ్యఅతిథిగా హాజరైన కూటమి పార్టీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం



**కాజులూరు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలంలో అత్యంత ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం హాజరై జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కాజులూరులో జనసేన నాయకులు అన్యం శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో, అలాగే గొల్లపాలెం గ్రామంలో జనసేన నాయకులు దేగల సతీష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించి వందలాది మందికి భోజనాలు అందించారు. అదేవిధంగా కాజులూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేసి వారి విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించారు. గొల్లపాలెం గ్రామంలో సమాజ పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాలు పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తికి ప్రతిబింబంగా నిలిచాయి. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ రాజకీయ నాయకుడిగానే కాకుండా గొప్ప మానవతావాదిగా కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. ప్రజల కష్టాలను అర్థం చేసుకుంటూ, సమాజంలోని బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. సేవా కార్యక్రమాల ద్వారా జన్మదినాన్ని అర్థవంతంగా నిర్వహించిన జనసేన నాయకులు, జనసైనికులను ప్రత్యేకంగా అభినందించారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, సేవా తత్వాన్ని ప్రోత్సహిస్తున్న పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# రామచంద్రపురంలో వైయస్ వర్ధంతి వేడుకలు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి వేడుకలను రామచంద్రపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ మరియు మాజీ రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మహానేత చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, ఆయన చిత్రపటం వద్ద నిశ్శబ్దంగా నిలబడి నివాళులు అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, పేదల సంక్షేమానికి వైఎస్సార్ అందించిన అమూల్యమైన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయని కొనియాడారు. కార్యాలయంలోని కార్యక్రమం అనంతరం నాయకులందరూ కలిసి రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహం వద్దకు భారీ ర్యాలీగా వెళ్లారు. అక్కడ విగ్రహానికి పూలదండలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. వైఎస్సార్ ఆశయ సాధన కోసం అందరం ఐక్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు


## ఉత్తరాంధ్ర ముఖ ద్వారం పాయకరావుపేట వద్ద సీఎం చంద్రబాబు జలహారతి



**కోటనందూరు సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను అందించే కీలక ఘట్టంలో భాగంగా పోలవరం ఎడమ కాలువ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా అన్నవరం దేవస్థానం ఆస్థాన పురోహితులు, నాగభట్ల రవి శర్మ, చామర్తి కన్నబాబు మరియు దేవస్థానం ఆస్థాన పురోహితులు కార్య నిర్వహణ అధికారితో పాటుగా సాంప్రదాయ బద్ధంగా గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు ఆచరించి అనకాపల్లి జిల్లా పాయకరావుపేట తాండవ సుగర్ ఫ్యాక్టరీ వద్ద పోలవరం ఎడమ కాలువ క్రాస్ రెగ్యులేటర్ నుంచి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర వైపు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించి గోదావరి జలాలకు జలహారతి ఇచ్చారు. అనంతరం పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి జిల్లాకు నీరు అందించే కార్యక్రమానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చేరడం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల సాకారమవుతున్న చారిత్రక ఘట్టమని సీఎం పేర్కొన్నారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయం, తాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రికి స్థానికులు తుని ఎమ్మెల్యే యనమల దివ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా నియోజకవర్గ నాయకులు పాల్గొని సంప్రదాయ కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనితతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనోత్సవాల నిర్వహణపై ఎస్పీ సమీక్షా సమావేశం

## వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీలతో ఎస్పీ సమీక్ష





**కాకినాడ, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అధ్యక్షతన రానున్న గణేష్ నిమజ్జ నోత్సవాలను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన కార్యక్రమానికి ఊరేగింపుగా వచ్చే వినాయక విగ్రహాల ర్యాలీలు పూర్తి క్రమశిక్షణతో నిర్వహించాలని సూచించారు. ఊరేగింపుల సందర్భంగా ఎలాంటి అసభ్యకరమైన పాటలు అశ్లీలమైన నృత్యాలు, డీజేలు నిర్వహించకుండా కేవలం భక్తి గీతాలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. పోలీసు శాఖ సూచించిన సమయ పాలనను పాటిస్తూ, అధికారులు నిర్దేశించిన రూట్ మ్యాప్ ప్రకారం గణేష్ ఉత్సవ కమిటీలు తమ ర్యాలీలను ముందుకు సాగించాలని కోరారు. పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. అలాగే మద్యం సేవించి ఎవరూ గణేష్ నిమజ్జన ఊరేగింపులలో పాల్గొనరాదని జిల్లా ఎస్పీ స్పష్టంగా హెచ్చరించారు. విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, వైద్య, ఆరోగ్య శాఖ, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులను ఉద్దేశించి జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జన ఘాట్ల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన సంఖ్యలో క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు, క్రేన్ ఆపరేటర్లు, గజ ఈతగాళ్ళు 24 గంటలూ అందుబాటులో ఉండేలా షిఫ్టుల వారీగా విధులను కేటాయించాలని సూచించారు. నిమజ్జన ఊరేగింపులు నిర్ణీత మార్గాల్లో నిరంతరాయంగా ముందుకు కదిలేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ సూచనలు, సమయపాలన రూట్ మ్యాప్‌ను ప్రతి గణేష్ ఉత్సవ కమిటీ తప్పనిసరిగా పాటించాలని కోరారు. గణేష్ నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా నిర్వహించేందుకు జిల్లా ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు మరియు వివిధ ప్రభుత్వ శాఖలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె అనిత, ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, పోర్ట్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్ కుమార్, కాకినాడ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం. నాగ దుర్గారావు, కాకినాడ రూరల్ ఇన్‌స్పెక్టర్ డి.కృష్ణ చైతన్య, కాకినాడ త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ కె.వి.ఎస్. సత్యనారాయణ, కాకినాడ ట్రాఫిక్ వన్ ఇన్స్పెక్టర్ ఎన్.రమేష్, ట్రాఫిక్ 2 ఇన్స్పెక్టర్ డి.రామారావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, ఎంపీడీవోలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు కాకినాడ జిల్లా గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**రౌతులపూడి, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన నాయకులు ఘనంగా నిర్వహిం చారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు అంగరంగర వైభవంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక సంక్షేమ కార్యక్రమాలు పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు షేక్ సలీం, కీర్తి నాగు, కె.గంగాధర్, శివ, రాము, గణేష్,పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**కోటనందూరు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : కాకినాడ జిల్లా, కోటనందూరు మండలంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు పెదపాత్రుని శ్రీనివాస్ సూచనల మేరకు నాయకులు ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు అంగరంగర వైభవంగా నిర్వహించారు. కే. ఏ.మల్లవరం గ్రామంలో పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అంకారెడ్డి రాజశేషు, పెనుమత్స ప్రవీణ్, అడపా వీర కృష్ణ, నక్కా రామకృష్ణ,కాళ్ల దొరబాబు, అల్లు రాజబాబు, తెలుగు మహిళా నాయకురాలు గంటా అమ్మాజీ, చిటికెల అజయ్, పి వి నాగూర్, ఏ తాతాజీ, కోట సందీప్ పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

# విలియం కేరికి ఘన స్వాగతం



**ఆలమూరు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : మండల పరిధిలో మడికి గ్రామానికి చెందిన విలియం కేరి ఇంటర్నేషనల్ గోల్ షాట్ బాల్ ఛాంపియన్‌షిప్ - 2026లో భూటాన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో తన అద్భుతమైన క్రీడను ప్రదర్శించి (భారతదేశానికి) స్వర్ణ పతకాని (గోల్డ్ మెడల్) కైవసం చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన యు విలియం కేరికి ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న విలియం కేరి రోడ్ మార్గం ద్వారా తన స్వగ్రామమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి గ్రామానికి చేరుకోవడంతో అభిమానులు, క్రీడాకారులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విలియం కేరికి ఘన స్వాగతం పలికారు. మడికి సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన విలియం కేరికి దుస్సాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. హిందుస్థాన్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందిన విలియం కేరీ భారత అండర్-15 గోల్ షాట్ బాల్ జట్టుకు ఎంపికై అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించి జట్టు విజయానికి కీలకంగా నిలిచాడు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే ఏదైనా సాధించవచ్చునని అనడానికి విలియం కేరి నిదర్శనమని కొనియాడారు. తన తల్లిదండ్రులైన ఉండ్రాసపు సుందర విజయ్, రాజమణి దీవెనలతో అంతర్జాతీయ క్రీడా ప్రపంచంలో మరిన్ని విజయాలు సాధించాలని కొనియాడారు.

# యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా హరిబాబు



**రౌతులపూడి, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : రౌతులపూడి మండల యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా 6వ సారీ కొరుప్రోలు హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య ఏకగ్రీవంగా ఎన్ను కోబడ్డారు. రౌతులపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో యుటిఎఫ్ 25వ కౌన్సిల్ సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు సూరిబాబు, నగేష్ పాల్గొని సమావేశాన్ని ప్రారంభించారు. ఎన్నికల అధికారిగా సీతారామయ్య, షేక్ బాబా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ వి ఆర్ మూర్తి, కోళ్ల రాంబాబు, రమణ బాబు, తాతబాబు, సింహాచలం, నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజల గుండెల్లో వైఎస్ఆర్ చిరస్మరణీయుడు



**రౌతులపూడి, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : రాష్ట్ర ప్రజల గుండెల్లో దివంగతనేత వై. ఎస్.రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వాసిరెడ్డిజమ్మీల్ అన్నారు. బుధవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకొని రౌతులపూడిలో ఆయన విగ్రహానికి వైఎస్ఆర్సిపి శ్రేణులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జమీల్ మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ఉండగానే స్వర్గానికే గడం మన అందరికీ బాధాకరమన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలతోనే జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి రాష్ట్ర ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. గత ఐదేళ్ల పాలన లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రజలకు చిరస్థాయిగా నిలిచారన్నారు. వాడ వాడలా వైఎస్ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గొల్లు చిన్నదివాణం, మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్. వి. వి.సత్యనారాయణ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో

# హెచ్ఐవి, ఎయిడ్స్ చట్టంపై శిక్షణా కార్యక్రమం



**తాళ్ళరేవు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా తాళ్లరేవులో బీమాబాయి మహిళా మండలి ప్రధాన కార్యాలయంలో హెచ్ఐవి నివారణ చట్టం 2017, ప్రభుత్వ ఆరోగ్య సేవలు మరియు సామాజిక భద్రత పథకాలపై హెచ్ఐవి గురైన వ్యక్తులకు మరియు దళిత బహుజన సమాజానికి అర్ధ వార్షిక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ హెచ్ఐవి గురైన వ్యక్తులను నింద మరియు వివక్షతలకు గురి చేసినట్లయితే వారు చట్టపరంగా శిక్షార్హులన్నారు. విద్యాసంస్థల్లో గాని,పని ప్రదేశాల్లో గాని,నివాసముండే చోట గాని వారిని వేరు భావంతో చూడడం ద్వారా జైలు శిక్షకు గురవుతారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెల్త్ ప్రోగ్రాం ఆర్గనైజర్ జి.చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా లభించే ఆరోగ్య సేవలు మరియు సామాజిక భద్రత పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని ప్రజలు మరియు బీమాబాయి మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజల హృదయాలలో నిలిచిన వైయస్సార్



**కోటనందూరు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : పేద ప్రజల హృదయాలలో నిలిచిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైఎస్ఆర్సిపి నాయకుడు కొరుప్రోలు కృష్ణ అన్నారు. కాకినాడ జిల్లా కోటనందూరులో వైయస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి మనకు దూరమై 17 సంవత్సరంలు అయినప్పటికీ ప్రతి పేదవాడు గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఆయన చేసిన సేవలు మరువలేనివి అని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్,ఉచిత విద్యుత్, జలయజ్ఞం, 108, రైతు రుణమాఫీ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు చేరు చేశారని అన్నారు. ఆయన ఆశయాలు ఆయన తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి గత 5 సంవత్సరాల పాలనలో ముందుకు తీసుకెళ్లారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వత్సవాయి నారాయణ మూర్తి రాజు, చింతల వెంకటరమణ, తోలెం విజయరాజు, ముక్కుడుపల్లి బాబురావు, చిటికెల వెంకటరమణ, ఉల్లూరి శ్రీను, మామిడి కృష్ణ, తోలెం అప్పారావు, గూటాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పి.కొట్టాంలో వైయస్సార్ వర్ధంతి కార్యక్రమం



**కోటనందూరు, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : కాకినాడ జిల్లా కోట నందూరు మండలం కోటనందూరు పి.కొట్టాం గ్రామంలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరిం చుకుని వైయస్సార్సీపీ మండల మహిళా కన్వీనర్ కాపారపు రత్నకుమారి, పలువురు నాయకులు, వైఎస్సార్ అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా స్మరించుకున్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్సార్ చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ సేవలు, జలయజ్ఞం వంటి పథకాలు, కార్యక్రమాల ద్వారా ప్రజలకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టి, వారి కష్టాలను దగ్గరగా తెలుసుకున్న నాయకుడిగా వైఎస్సార్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కే రత్నకుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోలెం రాజులు, మాజీ లోవ దేవస్థానం చైర్మన్ బొంగు ఉమారావు, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ, కాపారపు పెదరాజబాబు, మాజీ సర్పంచ్ పలకా సత్యనారాయణ, కాపారపు రాజబాబు, తోలెం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.








ఆలూలేదు సూలు లేదు.. కొడుకు పేరు సోమలింగ మటా ! సామెత లాగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కు ఎన్నికలు జరుగుతాయో లేదో కచ్చితంగా ప్రజాప్రతి నిధులు గాని, ప్రభుత్వాధి కారులు గాని చెప్పలేని సందిగ్ధత పరిస్థితి నెలకొంది. మూడుసార్లు జరిగిన మేయర్ ఎన్నికల్లో ఎస్ సి జనరల్, బీసీ మహిళ, ఓసి మహిళ రిజర్వేషన్లు జరిగితే ఈసారి రొటేషన్ ప్రకారం ఓసి నా ? అవుతుందా బీసీ నా? లేక మహిళ రిజర్వేషన్ అవుతుందా ? అన్నదానిపై స్పష్టత లేదు. 2011 జనాభా ప్రకారం ఎన్నికలు జరపాలా ! లేక 2026 జనవరిలో నిర్వహించిన జనగణన జనాభాను బట్టి ఎన్నికలు నిర్వహించాలా! స్పష్టత లేదు. మరొక సమస్య నగరాన్ని అనుకున్న సమీప గ్రామాలను విలీనం చేసి ఎన్నికల జరపాలా ? లేక కార్పొరేషన్ కు విడిగానే జరపాలా ? ఇలాంటి సంకట పరిస్థితుల్లో మేయర్ రేసులో నేనున్నానంటూ ప్రజాసేవ తెలియని కొంతమంది పుట్టుకురావడం హాస్యాస్పదంగా ఉందని నగర ప్రజలు, రాజకీయ పక్షాలు అభిప్రాయపడుతున్నాయి.

రాజమహేంద్రవరం కార్పొరేషన్ రాజకీయ నాయకులకు బ్రహ్మ పదార్థం లాగా కనిపిస్తోంది. రాజకీయ నాయకులు ఎవరైనా వారి స్థాయిని బట్టి మేయర్ గాను, లేదా కార్పొరేటర్ గా పోటీ చేసేందుకు ఆసక్తి చూపించడం, పదవుల ఆశించడం సహజం. అయితే జరుగుతాయో, జరగవో తెలియని ఎన్నికల్లో మేయర్ అభ్యర్థులుగా పోటీ చేస్తామని బయలుదేరడమే వింత గా ఉందంటున్నారు. వాస్తవానికి కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే మేయర్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ నుంచి సీనియర్ నాయకుడు, ఎన్నో ఏళ్ళు రాజకీయ త్యాగాలు చేసిన గన్ని కృష్ణ ముందు వరుసలో ఉంటారన్నది అందరికీ తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జనసేన నాయకుడు అత్తి సత్య నారాయణకు మేయర్ పదవికి హామీ లభించిందంటున్నారు. వీరిద్దరి మధ్యలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ నాయకుడు ఎర్ర వేణుగోపాల రాయుడు కూడా మేయర్ పదవిని ఆశిస్తున్నారు. ఈ పదవి కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నవారు కొందరు, గత ఎన్నికల్లో హామీ పొందినవారు మరికొందరు ఆశావహుల పై పానకంలో పూడకలా మధ్యలో పుట్టుకొస్తున్న ప్రకటనలు వారి ఆశలపై నీళ్లుచల్లినట్లు అయింది.

**నగర ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరిపై వ్యతిరేకత...**

నగరం మీద పట్టు కోసం నగర ఎమ్మెల్యే తన అనుచరులను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నారా అనే అనుమానాలు కూటమి పార్టీల నాయకుల్లో వ్యక్త మవుతున్నాయి. కూటమి ధర్మాన్ని కాదని ఏకపక్షంగా మజ్జి రాంబాబుకి మద్దతు ప్రకటించడం పట్ల కుటమి పార్టీల నాయకుల మధ్య విభేదాలకు ఆస్కార మిస్తున్నాయి. సొంత తెలుగుదేశం పార్టీలోనే వర్గాలు, కుమ్ములాటలున్న క్రమంలో మజ్జి మేయర్ ప్రకటన వాటిని మరింత రాజేసిందుంటున్నారు. కుటమిలో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీలు భాగస్వామ్యం. కార్పొరేషన్ ఎన్నికలు జరిగితే పొత్తు ధర్మం ప్రకారం ఏ పార్టీకి ఎన్ని స్థానాలు, ఎక్కడ పోటీ చేయాలి, ఉమ్మడి మేయర్ అభ్యర్థి ఎవరు ఇత్యాది అంశాలన్నీ ఆయా పార్టీల అధిష్టానాల స్థాయిలో చర్చించుకోవలసి ఉంది. అలాంటిదేమీ లేకుండానే ఏకపక్షంగా మజ్జి కి నగర ఎమ్మెల్యే మద్దతు పలకడం చూస్తే కుటమిలో ఐక్యత నేతి బీరకాయలో నెయ్యి చందాన ఉందని తెలుస్తోంది. ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరి పై సొంత పార్టీలోనూ, కూటమిలోను అసహనం, వ్యతిరేకత అర్థమవుతుంది. నగర మేయర్ పదవి అంటే ఎంపీ, ఎమ్మెల్సీలు, రాజ మహేంద్రవరం సిటీ, రూరల్ రాజానగరం అసెంబ్లీ నియోజక వర్గాలతో ముడిపడి ,వాటి ఎమ్మెల్యేల చర్చలు అనంతరం ఉమ్మడిగా ఆమోదయోగ్యం కావలిసి ఉంది. కూటమి ధర్మానికి వ్యతిరేకంగా సిటీ ఎమ్మెల్యే మజ్జి ని ఒక్కడినే భుజానికి వేసుకోవడం ఈ ప్రభావం కూటమి పార్టీల విజయాకాశాలను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం అవుతుంది.

**మజ్జి వ్యవహార శైలిపై అసంతృప్తి..**

బీసీ వర్గాల్లో మజ్జి వర్గం కన్నా అత్తి సత్యనారాయణ మరింత వెనుకబడిన వర్గానికి చెందినవారు. మజ్జి రాంబాబు మేయర్ అభ్యర్థి గా రాజకీయంగా సమర్థ నాయకుడా, సామాజి కంగా సత్తా ఉన్న నాయకుడా లేక ప్రజాసేవ పరాయణుడా అని నగర ప్రజలు చర్చించు కుంటున్నారు. గత రెండున్నర సంవత్సరాలలోనూ కూటమి పార్టీల మధ్య సమన్వయం సాధించింది లేదని మజ్జి వైఖరి పై విమర్శలున్నాయి. 2009, 14 లో ఆయన బంధువు ఒకరు మహిళ కార్పొరేటర్ గా ఉన్నప్పుడు 6 వార్డులో రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరించారని ఆరోపణలు ఉన్నాయి. పార్టీ నగర అధ్యక్షుడిగా నగరంలో సొంత తెలుగుదేశం పార్టీలో క్యాడర్ మధ్య సమన్వయం చేయలేని వ్యక్తి ని, మూడు పార్టీల కూటమిలో ఎలా చేయగలరని పలువురు ప్రశ్నిస్తున్నారు. సొంత సామాజిక వర్గం తూర్పు కాపు సంక్షేమ సంఘనికి పన్నెండు ఏళ్ల పాటు సేవలు అందించానని, చెప్పుకోవాడాన్ని కూడా పలువురు ఎద్దేవా చేస్తున్నారు. సంఘాన్ని అభివృద్ధి చేసింది కూడా ఏమీ లేదని సొంత సామాజిక వర్గాలే పెదవి విరుస్తున్నాయి. మజ్జి వ్యవహార శైలి పై సామాజిక వర్గంలోనూ, తెలుగుదేశం పార్టీలోనూ తీవ్ర అసంతృప్తి, అసహనం నెలకొందని తెలుస్తుంది. తెలుగుదేశం పార్టీ నాయకులు మద్యం వ్యాపారాలకు దూరంగా ఉండాలని పార్టీ అధిష్టానం ఒక పక్క చెబుతుండగా, మజ్జి కి నగరంలో మద్యంవ్యాపారంతో ప్రత్యక్ష , పరోక్ష సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యమే. అధికారికంగా ఉల్లిపాయల వ్యాపారం అయినప్పటికీ, అనధికారంగా మద్యం వ్యాపారంలో ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**కూటమి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కోసం గాలింపు...**

ఎన్నికలు జరిగితే గనక కూటమి పార్టీల మధ్య అందరికీ ఆమోదయోగ్య సామాజికంగా, ఆర్థికంగా ప్రజల్లో పలుకుబడి, ప్రజాసేవ తెలిసినవ్యక్తి కోసం కూడా ఆయా పార్టీల అధిష్టానాలు గాలిస్తున్నాయి. ఇక రెండోది ఎన్నికలంటేనే కోట్లతో ముడిపడిన వ్యవహారం, పైగా ఈసారి మేయర్ ఎన్నికలు ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నికునే విధానంలో జరుగుతుండ డంతో ఆర్థికంగా బలోపేతంగా ఉన్న వ్యక్తి పార్టీలకు అవసరం. నాలుగో సారి కూడా మేయరు, కార్పొరేషన్‌చే జిక్కించుకోవడానికి గత హామీలు నెరవేర్చడమా, కొత్త వ్యూహం ప్రకారం సమర్థుల కోసం తెలుగుదేశం పార్టీ, కూటమి పార్టీల అధిష్టానాలు గాలిస్తున్నాయని విశ్వాసనీయ వర్గాల సమాచారం.

# బత్తుల ఆధ్వర్యంలో ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు





## పవన్ ఆరోగ్యంగా ఉండాలని సుదర్శన యాగం, ధన్వంతరి హోమం

**కోరుకొండ, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు సుదర్శన యాగం ధన్వంతరి హోమం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని, పవన్ సేవలు దేశవ్యాప్తంగా విస్తరించాలని ఆకాంక్షిస్తూ రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుదర్శన యాగం, ధన్వంతరి హోమం, మహాలక్ష్మి హోమం, పూర్ణాహుతి వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుండి తన స్వగ్రామం గాదరాడం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, పవన్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. జంబుపట్నం గ్రామంలో జన సైనికులు, వీర మహిళలతో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గాదరాడ ఓం శివశక్తి పీఠం శంభాలనగర్ మండపంలో బత్తుల దంపతులు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులతో పవన్ జన్మదిన వేడుకలు ప్రత్యక్ష ప్రచారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా బత్తుల దంపతులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ సేవలు తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ప్రతి ఒక్కరు మన అభ్యర్థి విజయానికి కృషి చేయాలని, మన పార్టీ సత్తా చూపే విధంగా పవన్ ఆకాంక్షను నెరవేర్చ బాధ్యత మనందరిపై ఉందన్నారు. పవన్ రాష్ట్ర అభివృద్ధికి,కేంద్రంలో చేస్తున్న కృషిని కొనియాడారు. ఈకార్యక్రమంలో బత్తుల దంపతులు, జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెసాగు విధానంపై

# రైతులకు అవగాహన : డిపిఎం తాతారావు

**80% రాయితీపై అపరాలు సద్వినియోగం చేసుకోండి**



**కోరుకొండ, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : ప్రస్తుతం లెనిన్ ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల సాను కూలంగా లేకపోవడంతో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు అపరాలు సాగు చేయాలని వ్యవసాయశాఖ డిపిఎం తాతరావు తెలిపారు. బుధవారం మండలంలోపశ్చిమ గోనగూడెం, కనుపూరు తదితర గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 80% రాయితీపై రైతులకు అందించిన అపరాల పంపిణీ కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు లేక వరినాట్లు పడని ప్రాంతాలలో వరికి బదులుగా ఆరుతడి పంటలు మినువులు, చిరుధాన్యాలు వంటి సాగు చేయాలన్నారు. పశ్చిమ గోనగూడెం గ్రామంలో 'గొర్రెసాగు విధానం' (సీడ్ టిల్లర్) ద్వారా విత్తనాలు వేసే పద్ధతిని క్షేత్రస్థాయిలో డెమోల ద్వారా రైతులకు తెలియజేశారు. ఈ సీడ్ టిల్లర్ పద్ధతి వల్ల రైతులకు కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా, కోనోవీడర్ సాయంతో సులువుగా కలుపు తీయవచ్చు అన్నారు. వ్యవసాయశాఖ అధికాణి రామతులసి మాట్లాడుతూ మండలంలో వరి నాట్లు పడని రైతులకు 80% రాయితీపై ఒక ఎకరాకు, 8 కేజీలు 26 రూపాయలకు అందజేస్తున్నామన్నారు. ఈ అపరాలు వరినాట్లు వెయ్యని రైతులకు మాత్రమే అందజేయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం తాతారావు, రామ తులసి,గండి శ్రీనివాస్, వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ప్రజల్ని మోసం చేసిన కూటమి ప్రభుత్వం

**ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? వైసీపీ సీనియర్ నేత రౌతు జోగేశ్వరరావు ప్రశ్నలు**



**గోకవరం, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందని వైసీపీ సీనియర్ నాయకులు రౌతు జోగేశ్వరరావు ఆరోపించారు. గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల్లో అనేకం అమలుకు నోచుకోలేదని విమర్శించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఆ హామీని కూడా విస్మరించిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలు, మహిళలు, వివిధ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని జోగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో వైసీపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబటి అబ్రహం, గోలి సింహాచలం, పురం సత్యవతి, అర్జున వెంకటేశ్వరరావు, ధనుంజయ్, పత్తి రాజేష్, బాతు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా స్వర్గీయ వైయస్సార్

# 17వ వర్ధంతి వేడుకలు

**వాడ వాడల వైయస్సార్‌కు ఘనంగా నివాళులు**




**కోరుకొండ, సెప్టెంబర్ 2, విశ్వం వాయిస్ న్యూస్** : కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో స్వర్గీయ డాక్టర్ వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలను వైఎస్ ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్వర్గీయ డాక్టర్ వైయస్సార్ 17వ వర్ధంతి వేడుకలను పరిష్కరించుకొని ఆయా గ్రామాల్లో వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైయస్సార్ ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన 108 సేవలు, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్మెంట్, రైతుల వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వంటి పథకాలను కొనియాడుతూ వైయస్సార్ ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారన్నారు. అదేవిధంగా ఆయన తనయుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, తండ్రికి మించిన తనయుడుగా అన్ని వర్గాల ప్రజల మన్నులు పొందుతున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైయస్సార్సిపి సత్తా చాటాలని, వైకాపా శ్రేణులు కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించాలన్నారు. అదేవిధంగా రాజానగరం మండలంలో నిర్వహించిన వైయస్సార్ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పవన్ ఫ్యాన్స్‌కు బర్త్ డే ట్రీట్.. సమురాయ్‌గా పవర్ స్టార్ విధ్వంసం

# ‘ఓజీ 2’ గ్లింప్స్ వచ్చేసింది..




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ కు బర్త్ డే ట్రీట్ వచ్చేసింది. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న మోస్ట్ యాంటిసిపేటెడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఓజీ యూనివర్స్ నుంచి క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మేరకు ఓజీ కాన్సెప్ట్ ఎలా ఉంటుందో చెబుతూ ఒక ప్రత్యేకమైన వీడియోను విడుదల చేశారు. ఇవాళ (సెప్టెంబర్ 02) పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పుట్టిన రోజు. దీంతో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పారు. అలాగే అభిమానులు, నెటిజన్లు కూడా సోషల్ మీడియా వేదికగా పవర్ స్టార్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఇక ఇదే సందర్భాన్ని పురస్కరించుకుని పవన్ కల్యాణ్ అభిమానులకు బర్త్ డే ట్రీట్ ఇచ్చారు ఓజీ మేకర్స్. అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తోన్న స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ఓజీ యూనివర్స్ కు సంబంధించి ఒక క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈమేరకు ఓజీ సీక్వెల్ ఎలా ఉంటుందో వివరిస్తూ ఒక చిన్న గ్లింప్స్ వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో ‘ఓజీ యూనివర్స్’ గురించి పవన్ కల్యాణ్, డైరెక్టర్ సుజీత్, తమన్ మధ్య జరిగిన హాట్ డిస్కషన్స్ ను మనం చూడవచ్చు. ఈ సందర్భంగా తమన్ ఓజీ సీక్వెల్ గురించి కొన్ని క్రేజీ విషయాలు పంచుకున్నారు. ఓజీ 2 సినిమాను మన ఇండియా బ్యాక్‌డ్రాప్‌లో, సౌత్ ఈస్ట్ ఏషియన్ ఎమోషన్స్, వెస్ట్రన్ ప్రజెంటేషన్‌తో ప్లాన్ చేశామని థమన్ అన్నారు. ఇప్పటి నుంచి కొత్త బ్లడ్ గ్రూప్ ఓజీ అని తమన్ అనగా.. ఓజీ యూనివర్సల్ బ్లడ్ గ్రూప్ అని సుజీత్ అనడం విశేషం. ఇక ఇదే చర్చలో పవన్ కల్యాణ్ కూడా పాల్గొని ఓజీ యూనివర్స్ పై పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ‘ఈ కథలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ నుంచి సమకాలీన అంశాల వరకు అన్నీ యాడ్ చేస్తే అది నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుందని సలహా ఇచ్చారు. చివరకు ‘మనం బెస్ట్ అవుట్‌పుట్ ఇద్దాంలి అంటూ పవన్ కళ్యాణ్ చెప్పిన మాటలు పవర్ స్టార్ ఫ్యాన్స్ ను తెగ ఖుషీ చేస్తున్నాయి. ఇక వీడియో చివర్లో వచ్చిన యానిమేషన్ విజువల్స్ హైలైట్ అని చెప్పవచ్చు. సమురాయ్ స్టైల్ కత్తి యుద్ధాలు, అలాగే జపనీస్ కటానా కత్తులతో పవన్ కళ్యాణ్ విన్యాసాలు.. ఓజీ సీక్వెల్ పైఅంచనాలను అమాంతం పెంచేశాయి. త్వరలోనే ఈ క్రేజీ సీక్వెల్ నుంచి మరిన్ని అప్డేట్స్ రానున్నాయి.

## మమిత బైజుకు అస్వస్థత.. ఆసుపత్రిలో చేరిన హీరోయిన్..



చిత్రసీమలో వరుస హిట్ చిత్రాలు అందించి అభిమానులకు ఎంతో దగ్గరైన కథానాయిక మమితా బైజు. ఆమె విజయ్, సూర్యలతో కలిసి చిత్రాలలో నటించి మెప్పించింది. 2026లో ఇన్ని హిట్ చిత్రాలు ఇచ్చిన మమితా బైజు ఆసుపత్రిలో చేరారు. దీంతో ఆమె అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అసలు ఏం జరిగిందంటే.. ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో వరుస హిట్లతో స్టార్ డమ్ సంపాదించుకున్న హీరోయిన్ మమితా బైజు. మలయాళ చిత్రసీమలోకి కథానాయికగా ప్రవేశించి, ప్రస్తుతం తమిళ చిత్రసీమలో అగ్ర కథానాయికగా కొనసాగుతుంది ఈ ముద్దుగుమ్మ. ఈ 2026 సంవత్సరంలోనే ఆమె నటించిన మొత్తం 4 చిత్రాలు విడుదలయ్యాయి. ఆమె తొలుత మలయాళ చిత్రసీమలో సహాయ పాత్రలలో నటించినప్పటికీ, ‘సూపర్ శరణ్య’, ‘ప్రేమలు’ వంటి చిత్రాల ద్వారా సూపర్ హిట్స్ అందుకున్నారు. దీంతో ఆమె క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఆ తర్వాత ఆమె జి.వి. ప్రకాష్ కుమార్ సరసన ‘రెబెల్’ చిత్రంతో తమిళ చిత్రసీమలోకి కథానాయికగా ప్రవేశించారు. అనంతరం ‘డ్యూడ్’ తమిళంలో ఆమెకు తొలి హిట్ చిత్రంగా నిలిచింది. ఆ విధంగా ఆమె తమిళ చిత్రాలలో నటిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో, ఆమె ఈ 2026 సంవత్సరంలోనే పలు చిత్రాల ప్రచార కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ పరిస్థితిలో, ఆమె ఇప్పుడు ఆసుపత్రిలో చేరారు. అధిక జ్వరం, ఒళ్లు నొప్పుల కారణంగా ఆయనను ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం. జ్వరం కారణంగా ఆసుపత్రిలో చేరిన అనంతరం, ఈ వారం క్లైడ్ మలయాళీ కార్యక్రమం కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాలనుకున్న తన పర్యటనను రద్దు చేసుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఒక వీడియోలో మమితా బైజు మాట్లాడుతూ, తనకు విశ్రాంతి తీసుకోవడం తప్ప మరో మార్గం లేదని, వైద్యులు కూడా పూర్తి విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చారని చెప్పారు. దురదృష్టవశాత్తు, మనం వాగ్దానం చేసిన రోజున నేను అక్కడికి చేరుకోలేను. నేను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాను. అవకాశం ఉండి ఉంటే నేను అక్కడికి వచ్చేదాన్ని, కానీ ఇప్పుడు పూర్తి విశ్రాంతి తీసుకోమని వైద్యులు నాకు సలహా ఇచ్చారు. అంతేకాకుండా, ప్రయాణం వల్ల శారీరక నొప్పి, అలర్జీలు వస్తాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయాణించవద్దని వైద్యులు నాకు సలహా ఇచ్చారు. తనకు వేరే మార్గం లేక ఎలాగైనా వచ్చేదాన్నని చెప్పుకొచ్చింది మమి. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. మమిత ఒకే సంవత్సరంలో 200 కోట్ల రూపాయల 3 హిట్ చిత్రాలు ఇచ్చింది, అందుకే ఆమె అందరి దృష్టిని ఆకర్షించి ఉంటుందని అభిమానులు కామెంట్ చేయడం కూడా గమనార్హం. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఒక వీడియో కూడా ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది.




మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి

## భారత్ ఆతిథ్యం.. మ్యాచ్‌లు ఎప్పుడంటే?




ఐసీసీ మొట్టమొదటిసారిగా నిర్వహించనున్న మహిళల ఛాంపియన్స్ ట్రోఫీకి భారత్ ఆతిథ్యమివ్వనుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. మ్యాచ్‌లు క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా (ముంబయి), వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. కటాఫ్ డేట్ అయిన జులై 6 నాటికి మహిళల టీ20 ర్యాంకింగ్స్‌లో తొలి ఆరు స్థానాల్లో ఉన్న జట్లు ఇందులో పోటీపడనున్నాయి. ఈ లెక్కన ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక టోర్నమెంట్‌కు అర్హత సాధించాయి. ప్రస్తుతం ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్న పాకిస్థాన్ ఈ టోర్నమెంట్‌కు దూరమైంది. టీ20 ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. ప్రతి జట్టు మిగతా జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. టాప్-2లో నిలిచిన టీమ్‌లు ఫిబ్రవరి 28న జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. వాస్తవానికి, ఈ టోర్నీ శ్రీలంకలో జరగాల్సి ఉండగా.. శ్రీలంక క్రికెట్ బోర్డు పరిపాలన వ్యవహారాల్లో ఆ దేశ ప్రభుత్వం జోక్యం చేసుకుంటుందన్న కారణంగా ఆతిథ్య హక్కులను కోల్పోయింది. టోర్నమెంట్ నిర్వహణకు బంగ్లాదేశ్, భారత్, దక్షిణాఫ్రికాలను ఆప్షన్లుగా పెట్టుకున్న ఐసీసీ చివరకు ప్రత్యామ్నాయ ఆతిథ్య దేశంగా భారత్‌ను సిఫార్సు చేసింది. ఈ నిర్ణయాన్ని సెప్టెంబర్ 2న ఐసీసీ బోర్డు ఆమోదించింది.

### భారత్‌లో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ

మహిళల క్రికెట్లో తొలి ఛాంపియన్స్ ట్రోఫీని ఐసీసీ.. శ్రీలంక నుంచి భారత్‌కు తరలించింది. ముందు అనుకున్న ప్రకారం వచ్చే ఏడాది జరిగే ఈ టోర్నీకి లంక ఆతిథ్యం ఇవ్వాలి. కానీ ఆ దేశ క్రికెట్ పాలనా సమస్యలతో సతమతమవుతుండటంతో టోర్నీనిని మరో దేశంలో నిర్వహించాలని ఐసీసీ నిర్ణయించింది. భారత్‌తో పాటు దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్‌లో నిర్వహించే అంశాన్ని పరిశీలించిన ఐసీసీ చివరకు ఆతిథ్య హక్కులను ఇండియాకు అప్పగించింది. ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరిగే ఛాంపియన్స్ ట్రోఫీకి ముంబయి, వదోదరాలను వేదికలుగా ఖరారు చేశారు. మహిళల టీ20 క్రికెట్లో ఈ ఏడాది జులై 6 నాటికి తొలి ఆరు స్థానాల్లో ఉన్న జట్లు ఈ టోర్నీలో తలపడతాయి. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక అర్హత పొందాయి. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచే జట్లు ఫైనల్లో ఢీకొంటాయి. పురుషుల ఛాంపియన్స్ ట్రోఫీని 50 ఓవర్ల ఫార్మాట్‌లో నిర్వహిస్తుండగా.. మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని టీ20 ఫార్మాట్లో ఆడించాలని ఐసీసీ నిర్ణయించింది.

## అందుకే కోహ్లీ-అనుష్క లండన్‌లో స్థిరపడ్డారు..



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కుటుంబంతో కలిసి కొన్నాళ్లుగా లండన్‌లో నివాసం ఉంటున్న సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా మ్యాచ్‌లు ఉన్నప్పుడు, ఐపీఎల్ సీజన్ సమయంలో మాత్రమే అతడు భారత్‌కు వస్తున్నాడు. దీంతో కోహ్లీ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్‌కు గురయ్యాడు. అయితే, విరాట్ భారత్‌ను వీడి లండన్‌లో నివసించడానికి గల కారణాన్ని బాలీవుడ్ నటి మాధురీ దీక్షిత్ భర్త డా.శ్రీరామ్ నేనే తాజాగా బయటపెట్టారు. లండన్‌కు వెళ్లడానికి ముందు అనుష్క శర్మతో జరిపిన ఆసక్తికర సంభాషణను డా.శ్రీరామ్ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడియాతో జరిగిన ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. తమకున్న స్టార్‌డమ్ కారణంగా భారత్‌లో కోహ్లీ-అనుష్క సాధారణ జీవితాన్ని గడపలేకపోతున్నారని, అందుకే లండన్‌లో స్థిర నివాసం ఏర్పరచుకున్నారని తెలిపారు. పబ్లిక్ అటెన్షన్‌కు దూరంగా ప్రశాంతమైన జీవితాన్ని గడిపేందుకు వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. కోహ్లీ దంపతులు తమ పిల్లలు వామికా, అకాయ్‌లను మీడియా దృష్టికి దూరంగా ఉంచి సాధారణంగా పెంచాలనుకుంటున్నారని తెలిపారు. మరోవైపు, టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన కోహ్లీ.. వన్డే మ్యాచ్‌లు, ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో భారత్‌కు వస్తున్నాడు. ఇక, 2018లో విడుదలైన ‘జీరో’ చిత్రం తర్వాత అనుష్క శర్మ నటనకు దాదాపు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత ఆమె ‘చక్దా ఎక్స్‌ప్రెస్’లో నటించారు. ఇందులో అనుష్క మాజీ భారత క్రికెటర్ ఝులన్ గోస్వామి పాత్రను పోషించారు. అయితే, ఈ సినిమా ఇంకా విడుదల కాలేదు. ఆమె 2022లో తన నిర్మాణ సంస్థ ‘క్లీన్ స్లేట్ ఫిల్మ్స్’ బాధ్యతల నుంచి వైదొలిగి కుటుంబ బాధ్యతలు చూసుకుంటోంది.



## శ్రీకాంత్ శుభారంభం

### లక్ష్యసేన్ ఔట్ - చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో కిదాంబి శ్రీకాంత్ శుభారంభం చేశాడు. బుధవారం తొలి రౌండ్లో అతడు 21-16, 21-15తో చి యు జెన్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు. శ్రీకాంత్ రెండో రౌండ్లో విక్టర్ లాయ్ (కెనడా)తో తలపడతాడు. మరోవైపు భారత నంబర్‌వన్ పురుషుల సింగిల్స్ ఆటగాడు లక్ష్యసేన్ మాత్రం తొలి రౌండ్ దాటలేకపోయాడు. పేలవ ప్రదర్శన చేసిన అతడు, 14-21, 7-21తో విక్టర్ లాయ్ చేతిలో ఓడి, టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. తొలి గేమ్‌లో 4-0తో నిలిచిన లక్ష్య.. ఆ తర్వాత వెనుకబడ్డాడు. ఆ తర్వాత లాయ్, గేమ్‌ను తన నియంత్రణలోకి తెచ్చుకున్నాడు. ఏ దశలోనూ లక్ష్యను లయ అందుకోనివ్వలేదు. అలవోకగా ఆ గేమ్‌ను గెలిచిన లాయ్.. రెండో గేమ్‌లో మరింత ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. లాయ్ గత నెలలో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించాడు. లాయ్ చేతిలో ఓడడం లక్ష్యకు ఇది మూడోసారి. అతడిపై లక్ష్య ఒకే ఒక్కసారి గెలిచాడు. పేలవ ఫామ్‌లో ఉన్న లక్ష్య, ఇటీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్లోనే ఓడిన సంగతి తెలిసిందే. మరోవైపు మహిళల సింగిల్స్‌లో తన్వి శర్మ బోణీ కొట్టింది. తొలి రౌండ్లో ఆమె 21-16, 21-17తో డెన్మార్క్ అమ్మాయి అమైల్ షుల్జ్‌పై విజయం సాధించింది. రెండో రౌండ్లో ఆమె.. తొమోకా మియాజకి (జపాన్)తో తలపడుతుంది. సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జంట కూడా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్లో ఈ ద్వయం 21-11, 21-6తో జునైది ఆరిఫ్-కాంగ్ కై జింగ్ (మలేసియా) జోడీని ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా భారత్‌కు మంచి ఫలితమే వచ్చింది. ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జంట అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకుంది. ఆరంభ రౌండ్లో ఈ జోడీ 21-8, 21-9తో తొనాకోర్న్ సేహెంగ్-తొనిచా సేహెంగ్ ద్వయంపై విజయం సాధించింది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com